




ఉపాధిలో.. పశుగ్రాసం సాగు

- రైతులు, పోషకులకు ప్రభుత్వం ఊతం
- నూరు శాతం రాయితీతో పథకం అమలు
- గరిష్ఠంగా అరెకరంలో సాగుకు ప్రోత్సాహం
- లబ్ధిదారుల ఎంపికలో అధికంగా రాజకీయ జోక్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతులు, పశుపోషకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే మినీ గోకులాల పథకం కింద షెడ్ల నిర్మాణాలను చేపట్టారు. చిన్న.. సన్నకారు రైతుల కోసం కొత్తగా పశుగ్రాస సాగు పథకాన్ని ప్రవేశపెట్టింది. పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం ఆర్థికంగా ఊతం ఇస్తోంది. గ్రాసం పెంపకం పథకానికి ఉపాధి హామీ నిధులు వెచ్చిస్తున్నారు. ఈ పథకాన్ని నూరు శాతం రాయితీతో అమలు చేస్తున్నారు. గరిష్ఠంగా అర ఎకరంలో పశుగ్రాసం పెంచుకునేందుకు ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తోంది. రైతుల్లో ఎక్కువ మంది వ్యవసాయానికి తోడుగా పాడిని చేపడుతుంటారు. గేదెలు.. ఆవులు పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పశుగ్రాసానికి ఇప్పటి వరకు పెద్దగా కొరత లేదు. వేసవిలో గ్రాసం కొరత తలెత్తే పరిస్థితులు ఉంటాయన్న అంచనా. ఈ పరిస్థితుల్లో నీటి ఆధారం ఉన్న రైతులు ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. తద్వారా పచ్చి మేతను పాడి పశువులకు అందించొచ్చు. ఒక్కో మండలానికి 35 నుంచి 45 ఎకరాల వరకు సాగుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. వీరికి ఖచ్చితంగా ఉపాధి జాబ్ కార్డు కలిగి ఉండాలి. అర్హులైనవారు సమీపంలోని పశువైద్యులు.. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు పొలానికి సంబంధించిన 1బీ, జాబ్ కార్డు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం నకలు కాపీలను జత చేయాలి. గ్రామ సభ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులు పశుగ్రాసం సాగుకు అర్హులు.

నిధుల కేటాయింపు ఇలా..

పది సెంట్లలో పశుగ్రాసాల పెంపకానికి కూలి ఖర్చు కింద రూ.3 వేలు, సామగ్రి ఖర్చుల కింద విత్తనం కొనుగోలుకు రూ.3,599, మొత్తంగా రూ.6,599 చెల్లి స్తారు. 50 సెంట్లలో పెంపకా నికి వేతనం కింద రూ.15 వేలు, విత్తన ఖర్చు లకు రూ.17,992 అందజేస్తారు. ఉపాధి పథకం అధికారులు, పశువైద్యులు ధ్రువీకరణ చేసిన అనంతరం రైతులకు బిల్లులు చెల్లిస్తారు.

జిల్లాకు వెయ్యి ఎకరాలు..

ఒక్కొక్క జిల్లాకు వెయ్యి ఎకరాల్లో ప్రశు గ్రాసం పెంపకం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో ఒక్కొక్క జిల్లాలో వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చిన్న.. సన్న కారు రైతులు గ్రాసం పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో రైతుల నుంచి దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలోనే వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం అధికంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. పశువులు లేని రైతులు కూడా ఈ పథకం కింద దరఖాస్తులు ఇస్తున్నారన్న విమర్శ లున్నాయి. పశువుల పెంపకంపై ఆధారపడి జీవించే రైతులకు ఈ పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు. రైతులు విస్తృత ప్రయోజనాల కోసం ప్రవేశ పెట్టిన పశుగ్రాస పథకంపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేనిపక్షంలో అర్హులకు అన్యాయం జరగడంతో పాటు పథకం లక్ష్యాలు నీరుగారిపోయే ప్రమాదం ఉంది.

100 రోజుల ఉపాధి హామీ
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం
ఆంధ్రప్రదేశ్



ప్రత్తిపాడు మండలం యనమదల సచివాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల సీట్లు (పాతచిత్రం)

- సచివాలయాల్లో నిర్లక్ష్య ధోరణి
- నత్తనడకన సాగుతోన్న పరిశ్రమల సర్వే
- ప్రభుత్వ ఆదేశాలపై ఉద్యోగుల అలసత్వం
- సామాజిక పింఛన్ల పంపిణీలోనూ అదే తీరు
- ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలన్నా పట్టించుకోని వైనం
- తనిఖీల్లో పరిస్థితి చూసి బిత్తరపోతున్న ఉన్నతాధికారులు
- అడిగినంత నగదు ఇస్తే ఏ సర్టిఫికెట్ అయినా జారీ చేస్తోన్న ఉద్యోగులు

ఆ.. చేద్దాంలే

అలక్ష్యం. 'ప్రభుత్వ లెక్కల ప్రకారం గుంటూరు జిల్లాలో 10326 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో ఎన్ని ఉనికిలో ఉన్నాయో తెలియదు. ఆ లెక్క తేల్చేందుకు ప్రభుత్వం సర్వే ఆరంభించింది. సచివాలయ సిబ్బంది ఈ సర్వేపై ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో సదరు సర్వే నత్తకంటే నిదానంగా సాగుతోంది. రోజువారీ నివేదికలో జిల్లా వెనుకబడే ఉంది.'

అబద్ధం.. 'పెన్షన్ల పంపిణీ రోజున జిల్లా అధికారులు తక్కెళ్లపాడు వెళ్లారు. అక్కడ పెన్షన్లు అందిస్తున్న సచివాలయ ఉద్యోగి ఓ చోట కూర్చొని అందరినీ అక్కడకు పిలిపించి పంపిణీ చేస్తున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తిని కూడా అదేవిధంగా పిలిపించి పెన్షన్ ఇచ్చారు. జిల్లా అధికారి ఇదేమిటని నిలదీస్తే ఆ వ్యక్తి ఇల్లు ఇక్కడే అని ఉద్యోగి సమాధానం ఇచ్చారు. ఏది చూద్దాం పదా అని జిల్లా అధికారి పెన్షన్ దారుడు ఇంటికి వెళ్తే అది సుమారు అర కిలోమీటరు పైనే ఉంది. అంత దూరం నుంచి కాళ్లు ఈడ్చుకుంటూ పెన్షన్ కోసం రావాల్సి వచ్చింది.'

అలసత్వం ఇటీవల ప్రత్తిపాడు మండలం యనమదలలో సిబ్బంది సచివాలయం తలుపులు తీసేసి వెళ్లిపోయారు. సచివాలయంలో విలువైన రికార్డులు, కంప్యూటర్లు, ప్రింటర్లు అనేకం ఉన్నా వాటిని గాలికి వదిలేశారు. పనుల కోసం వచ్చిన వారు సచివాలయంలో అన్ని సీట్లు ఖాళీగా ఉండటం.. ఎంతసేపు వేచి ఉన్నా ఒక్కరు కూడా రాకపోవడంతో గ్రామస్తులు విస్తుపోవాల్సి వచ్చింది. తలుపులు బార్లా తీసి వెళ్లిపోవడంలో ఉద్యోగుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.



సకాలంలో విధులకు హాజరు కావాలి.. పనుల కోసం వచ్చే వారిని తిప్పించుకోకూడదు.. సామాజిక పింఛన్లు ఇళ్ల వద్దే పంపిణీ చేయాలి.. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలపై ఎప్పటికప్పుడు స్పందించాలి... అని ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు సూచిస్తోంది. అయితే ప్రతీ అంశంలోనూ సచివాలయ ఉద్యోగుల్లో నిర్లక్ష్యం.. అలక్ష్యం.. అశ్రద్ధ.. అవినీతి.. కనిపిస్తోంది. కొన్ని సచివాలయాల పరిధిలో ఉద్యోగులు 11 గంటలకు కూడా రావడంలేదని.. ఏదైనా పనిపై వెళ్తే సరైన సమాధానం ఉండటంలేదని.. ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తనిఖీల సమయంలోనూ ఉద్యోగుల సమయపాలన.. పనులపై నిర్లక్ష్యం.. ఆదేశాలపై అలక్ష్యం.. తేటతెల్లమవుతోంది. కొన్ని సార్లు నిర్లక్ష్యంగా ఉండే ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నా.. వారి పనితీరులో మాత్రం మార్పు ఉండటంలేదని ఉన్నతాధికారులే వాపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కొందరు సచివాలయ ఉద్యోగుల పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

గుంటూరు సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏ పని చెప్పినా సిబ్బంది సాచివేత ధోరణి.. ప్రభుత్వ ఆదేశాలను కూడా పట్టించుకోవడంలేదు.. ఇదీ పలు సచివాలయాల్లోని ఉద్యోగుల తీరని కొందరు జిల్లా అధికారుల అభిప్రాయం. కొందరు సచివాలయ ఉద్యోగులు పనుల కోసం వచ్చే వారిని మామూళ్ల కోసం పీడిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేసినా తమకు ఏమీ కాదన్న ధోరణిలో కొందరు ఉన్నారు. పరిశ్రమల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉండగా.. దానిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యధోరణిలో ఉన్నారు. ఈ సర్వే అంశంలోనే సచివాలయ ఉద్యోగుల పనితీరు తెలుస్తోందని పలువురు ఉన్నతాధికారులు వాపోతున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎక్కడ.. ఎన్ని ఉనికిలో ఉన్నాయో తెలిస్తే వాటికి మరిన్ని ప్రోత్సాహకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సర్వే పూర్తి అయితేనే పరిశ్రమల లెక్క తెలుస్తోంది. అందుకు సంబంధించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రానికి వస్తాయి. గతంలో ఒకసారి ఈ సర్వే ఆరంభించి మధ్య లోనే నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ సర్వే ఆరంభించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో జరుగుతున్న పరిశ్రమల సర్వే చాలా నిదానంగా జరుగుతుంది. సర్వేకి సంబంధించి ఉదాహరణకు ఈ నెల 4న నివేదికను పరిశీస్తే.. గుంటూ రు జిల్లాలో 10326 పరిశ్రమలు ఉండగా, ఆ రోజు వరకు కేవలం 2591 మాత్రమే సర్వే పూర్తి చేశారు. ఆ తర్వాత రోజు నుంచి ఆ సంఖ్య దాటడం లేదు. కొన్ని సచివాలయాల్లో రోజుకు 20 కంటే ఎక్కువ సర్వే జరగడం లేదు. ఈ నివేదికలు చూసి జిల్లా అధికారులు సైతం నిత్యం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఉద్యోగుల తీరులో మార్పు రావడంలేదు.

పెన్షన్ పంపిణీ విధానమే..

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ విధానాన్ని కొందరు సచివాలయ ఉద్యోగులు మార్చేశారు. ప్రతి ఇంటికి ఉద్యోగులు వెళ్లి పెన్షన్ అందజేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే కొందరు ఉద్యోగులు ఒక చోట కూర్చొని లబ్ధిదారులను పిలిపించి ఇస్తున్నారు. జిల్లా అధికారుల ఆకస్మిక తనిఖీలో ఇదే విషయాలు వెలుగు చూస్తున్నాయి. చివరకు ముఖ్యమంత్రి కూడా ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇస్తుంటే కొందరు సిబ్బంది ఇలా ఎందుకు చేస్తున్నారన్నది జవాబు దొరకని ప్రశ్నగా ఉంది. ప్రభుత్వం నుంచి వస్తున్న ఆదేశాల్లో లోపాలను వెతికి వివాదాలు సృష్టిస్తున్న సచివాలయ ఉద్యోగులను (మిగతా 8వ పేజీలో)

జిల్లాలో పలువురు అధికారుల బదిలీ

నరసరావుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ కేఎల్‌రావు పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వరద సుబ్బారావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బీ గాయత్రీదేవి నియమితులయ్యారు. వరద సుబ్బారావును సమగ్రశిక్ష జిల్లా ఏపీసీగా నియమించారు. జిల్లా సరఫరా అధికారిగా ఉన్న నారదమునిని బదిలీ చేస్తూ పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా నియమించారు.

కాలువల మరమ్మతులకు టెండర్లు

- సత్తెనపల్లి డివిజన్‌లో నిర్వహణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కాల్వలపై.. కూటమి నేతల కన్ను, నిలిచిన టెండర్లు.. శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జలవనరుల శాఖ అధికారులు స్పందించారు. నిలిచిన పనుల నిర్వహణకు టెండర్లు పిలిచారు. అయితే, సత్తెనపల్లి, వినుకొండ, లింగంగుంట్ల ఓఅండ్‌ఎం డివిజన్‌లో పనులు ఆగిపోగా, ఒక్క సత్తెనపల్లి డివిజన్‌లో టెండర్లు పిలవడం గమనార్హం. ఈ డివిజన్ పరిధిలో 62 పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి గతంలో ఐదు పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. మిగతా 57 పనులకు సంబంధించిన టెండర్లు రద్దు చేశారు. ఈ పనులకు టెండర్లు తిరిగి నిర్వహించారు. ఈ నెల 19న టెండర్లు తెరవనున్నారు. సుమారు రూ. 1.50 కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నారు. కాగా వినుకొండ డివిజన్ పరిధిలో రూ 1.78 కోట్ల వ్యయంతో 34 పనులు, లింగంగుంట్ల ఓఅండ్ ఎం డివిజన్ పరిధిలో రూ 4.21 కోట్ల వ్యయంతో 76 పనులు చేపట్టేందుకు ఆయా డివిజన్‌ల వారీగా నిర్వహించిన టెండర్లు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ రెండు డివిజన్‌లో పనులు చేపట్టేందుకు తిరిగి టెండర్లు నిర్వహించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

నేడు జాతికి అంకితం



చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిలో చిలకలూరిపేట వద్ద సుమారు రూ.వెయ్యి కోట్లతో నిర్మించిన 16.4 కిలోమీటర్ల ఆరులైన్ల బైపాస్ రోడ్డును ప్రధాని మోదీ బుధవారం జాతికి అంకితం చేయనున్నారు. విశాఖపట్నంలో జరిగే పలు కార్యక్రమాలలో భాగంగా ప్రధాని వర్చువల్‌గా ఈ రోడ్డును ప్రారంభిస్తారు.

-చిలకలూరిపేట



పందెం కోళ్లకు భలే గిరాకీ!

- సంక్రాంతి బరికి సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

8

ముక్కోటి ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా

దొంగతనాలు

- రూ.30 లక్షల విలువైన బంగారం, వెండి చోరీ

6

లింగంగుంట్లలో కలెక్టర్ తనిఖీలు

- పింఛన్లు, మధ్యాహ్న భోజనం పరిశీలన

నరసరావుపేట రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో మంగళవారం పింఛన్ల లబ్ధిదారులను స్వయంగా పరిశీలించి.. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పింఛన్ లబ్ధిదారుల పరిశీలన జరుగుతుందని అర్హత లేకుండా



లింగంగుంట్లలో పెన్షన్‌లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పొందుతున్న వారిని గుర్తిస్తున్నట్లు చెప్పారు. ములకలూరులో పింఛన్ లబ్ధిదారుల పరిశీలనను పీడీ బాలునాయక్, వైద్యబృందం పరిశీలించింది.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. పేడబ్బా కాలనీలోని ఎంపీపీ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భోజనం చేస్తున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలకు ప్రహరీ లేదని ప్రధానోపాధ్యాయుడు సెట్టం రాజాచౌదరి కలెక్టర్‌కు తెలిపారు. సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ వేణుగోపాలరావుకు కలెక్టర్ సూచించారు.

సదస్సులతో సమస్యలకు చెక్ పడేనా?

- నేటితో ముగియనున్న రెవెన్యూ సదస్సులు
- ప్రజల నుంచి భారీగా అభ్యంతరాల స్వీకరణ
- వచ్చిన అర్జీల్లో 80 శాతం మ్యుటేషన్ వివాదాలే

3,849 అర్జీల్లో.. 2790 పరిష్కారం.. 1059 పెండింగ్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల వైసీపీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా భూములను చెరబట్టడమే కాకుండా రాజకీయ జోక్యంతో వేలాది ఎకరాలను వివాదంలో పడేసి ఎంతోమందిని బాధితులుగా మార్చారు. వారి గోడు వినకపోగా తిరిగి వారిపైనే కేసులు బనాయించి భూ మాఫియాకు వైసీపీ నేతలు అండగా నిలిచారన్న విమర్శలు, ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. గత ప్రభుత్వంలో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడమే కాకుండా వాటిని వైసీపీ నేతలే హస్తగతం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఈ పరంపరలోనే కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో భూవివాదాలకు పరిష్కారం దొరుకుతుందనే ఆశతో పెద్ద సంఖ్యలో బాధితులు అధికారులను ఆశ్రయించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఎక్కువగా భూవివాదాలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ప్రజాదర్బార్లలో సైతం ఎక్కువగా భూ బాధితులే ఉన్నారు. ఈ క్రమంలో ఆయా సమస్యలకు చెక్ పెట్టడంపై కూటమి ప్రభుత్వం ఆరంభం నుంచే దృష్టి సారించింది. రెవెన్యూ గ్రామాల ప్రామాణికంగా సదస్సులు నిర్వహించి భూ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిసెంబరు 6 నుంచి వాటికి శ్రీకారం చుట్టగా జనవరి 8 బుధవారంతో ఆ సదస్సులు ముగియనున్నాయి. ఒక్కో మండలంలో రోజుకు ఒక గ్రామంలో సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామంలోని భూ బాధితుల సమస్యలతో మళ్లీ అధికారులను ఆశ్రయించకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఒక్కో గ్రామంలో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకుని సదస్సులపై బాధితుల నుంచి అర్జీల స్వీకరణ.. కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తూ వచ్చారు. చివరిగా ఈ నెల 8 బుధవారం కొన్ని గ్రామాల్లో మాత్రమే సదస్సులు జరగనున్నాయి. తహసీల్దార్ నేతృత్వంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్‌వోలు బృందంగా ఏర్పడి సదస్సుల్లో పాల్గొన్నారు. కొన్ని మండలాల్లో దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీ, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు కూడా సదస్సులకు హాజరయ్యారు. ఈ సదస్సులతో అయినా భూ సమస్యలకు చెక్ పడాలని బాధితులు ఎదురు చూస్తున్నారు. దాదాపుగా నెలకుపైగా జరిగిన రెవెన్యూ సదస్సుల్లో పెద్దసంఖ్యలో మ్యుటేషన్‌కు సంబంధించి వివాదేలా ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి వస్తున్న భూవివాదాలకు సంబంధించిన సమస్యలపై ఆయా సదస్సుల్లో బాధితులు బారులు తీరారు. రికార్డుల్లో ఉండాల్సిన భూమి కంటే తక్కువ విస్తీర్ణం ఉందని పలువురు నివేదించగా ఇలాంటి ఫిర్యాదుల విషయంలో ఉన్నతస్థాయిలో సర్వే నిర్వహించి తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. ముందుగా ఇరుపార్టీలకు నోటీసులు జారీ చేయడంతో పాటు సిబ్బంది విచారణ చేపడతారని తర్వాతే వీటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుందని యంత్రాంగం చెబుతోంది. 20 శాతం పైగా దరఖాస్తుల్లో కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ, ఎఫ్‌లైన్ పిటిషన్లు వంటివి ఉన్నాయి. వాటిని సత్వరమే పరిష్కరించడానికి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో కూడా రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు అందాయి.



పెదకూరపాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ డానియేలు

- జిల్లాలో నిర్వహించిన సదస్సుల్లో బాధితులు ఇప్పటికి 3,849 అర్జీలను అందజేశారు. వీటిలో 2790 అర్జీలను అధికారులు పరిష్కరించారు. పెండింగ్‌లో 1059 అర్జీలు ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబం ధించి 2,578 అర్జీలు సమర్పించగా 1892 అర్జీలను పరిష్కరించారు. సర్వే శాఖకు సంబంధించి 1271 అర్జీలను బాధితులు అందజేయగా 898 అర్జీలు పరిష్కారం కాగా 373 పెం డింగ్‌లో ఉన్నాయి. క్షేత్ర స్థాయి విచారణతో సంబంధం లేకుండా రికార్డుల్లో తప్పులు, ఇతరాత్ర సాంకేతిక తప్పిదాలే పరిష్క రించిన వాటిల్లో ఎక్కువగా ఉన్నాయి.

సంక్రాంతికి అదనపు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు అదనంగా ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07205-కాకినాడ టౌన్ - వికారాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 9వ తేదీన రాత్రి 9 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు, 10వ తేదీన సాయంత్రం 5 గంటలకు వికారాబాద్ - శ్రీకాకుళం రోడ్డు (07207) రైలు బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయి. ఈ నెల 11న మధ్యాహ్నం 2.45గంటలకు శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి (07208) రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు గమ్యస్థానం చేరుతుందని తెలిపారు.

హుబ్లీ వరకే షాలిమార్ - వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్

వారంలో నాలుగు రోజుల పాటు గుంటూరు మీదుగా ప్రయాణించే షాలిమార్ - వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్ (18047) రైలు ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు హుబ్లీ వరకే ప్రయాణించనుంది. ఈ విషయాన్ని సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు.

నడికుడి మార్గంలో రైళ్ల రాకపోకల్లో ఆలస్యం

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నడికుడి మార్గంలో మంగళవారం వేకువ జామున పలు రైళ్లు నాలుగైదు గంటల ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. సోమవారం అర్ధరాత్రి సమయంలో సికింద్రాబాద్ వైపు నుంచి వస్తున్న ఖాళీ గూడ్స్ రైలుకు సంబంధించిన ఒక భోగీ పొందుగల - నడికుడి సెక్షన్‌లో పట్టాలు తప్పడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో రైళ్ల రాకపోకలపై ప్రభావం పడింది. గుంటూరు వైపు నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరిన రైలు నంబరు 17255 నరసపూర్-లింగంపల్లి, చెన్నై సెంట్రల్ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్(12603)లను మార్గ మధ్యంలో నిలిపివేశారు. పట్టాలు తప్పిన భోగీని తిరిగి ట్రాక్ పైకి ఎక్కించి క్లియర్ చేసేందుకు దాదాపు మూడు గంటల సమయం పట్టింది. ఈ కారణంగా ఆ రెండు రైళ్లు సికింద్రాబాద్‌కు ఐదు గంటల ఆలస్యంగా చేరాయి. భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), తిరుపతి - లింగంపల్లి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ (12733) లను విజయవాడ నుంచి దారి మళ్లించడంతో అవి కూడా ఐదు గంటలకు పైగా ఆలస్యంగా సికింద్రాబాద్‌కు చేరాయి. రేపల్లె - వికారాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్ (17626) రెండున్నర గంటల ఆలస్యంగా, సికింద్రాబాద్ వైపు నుంచి గుంటూరుకు బయలుదేరిన కాచిగూడ-రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ (17625) నాలుగున్నర గంటల ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరాయి. లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ (17256) దాదాపుగా ఐదు గంటల ఆలస్యంగా గుంటూరుకు చేరుకుని ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లింది. నాగర్‌సోల్ - నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌ని సికింద్రాబాద్ నుంచే కాజీపేట మార్గంలోకి దారి మళ్లించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో రైళ్ల వేగాన్ని 30 కిలోమీటర్లకు నియంత్రిస్తూ రైల్వే శాఖ కాషన్ ఆర్డర్‌ని జారీ చేసింది. ఈ సంఘటనపై ఉన్నతస్థాయి విచారణని రైల్వే అధికారులు ప్రారంభించారు. గతంలోనూ విష్ణుపురం సమీపంలో ఇలాంటి సంఘటనే జరిగింది. ఈ నేపథ్యంలో నడికుడి - మిర్యాలగూడ - నల్గొండ మధ్యన ట్రాక్ పటిష్టతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విడదల రజినిపై కేసులో 'సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ)నిబంధనలు అనుసరించాలి'

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన చేపట్టిన మాజీ మంత్రి విడదల రజినీ, ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రజలకు అసౌకర్యం కలి గించారని పేర్కొంటూ నమోదు చేసిన కేసులో ఆమెపై సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ) ప్రకారం నడచుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్ చార్జీల విషయంలో నిరసన చేపట్టి, ట్రాఫిక్ అంతరాయం కలిగించడంతోపాటు ప్రజలకు అసౌకర్యం కలిగించారని పేర్కొంటూ చిలకలూరిపేటకి చెందిన పిల్లి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు రజినిపై చిలకలూరిపేట పట్టణ పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు వచ్చింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ స్పందిస్తూ పిటిషనర్‌కు సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ)కింద నోటీసులు ఇస్తామన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 567.00 అడుగులు ఉంది. ఇది 249.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8022 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,597 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 50,886 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 50,886 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 38.71 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం. బబిత తదితరులు

హెల్మెట్ ధరిస్తే సురక్షితంగా గమ్యస్థానానికి

- రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, పోలీసుల సూచన

తుళ్లూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం ద్వారా ద్విచక్రవాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర వచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎమ్ బబిత సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన ప్రాధాన్యతను వివరించడం కోసం మంగళవారం తుళ్ళూరు పోలీసులతో కలిసి హైకోర్టు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బబిత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పాట్రన్-ఇన్-చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరి సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినటు వివరించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహ నాలు నడపటం మోటారు వాహన చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరమని తెలిపారు. ఇకపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి శిక్షలు కఠినంగా అమలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ సేవల కమిటీ కార్యదర్శి జీ మాలతి మాట్లాడుతూ చాలామంది ద్విచక్రవాహన దారులు తమ హెల్మెట్‌ను వాహనంపై ఉంచి నడుపుతున్నారని, వాహనాల తనిఖీల సమయంలో కంగారులో హెల్మెట్ ధరించే క్రమంలో కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. తుళ్ళూరు డీఎస్పీ టీ మురళీకృష్ణ మాట్లాడుతూ రూ. 10 వేల విలువ చేసే సెల్ ఫోన్ కొనుగోలు చేస్తేనే దానికి స్క్రీన్ గార్డ్ వేస్తున్నారని, అంతకన్నా విలువైన ప్రాణాలు రక్షించుకోవడం కోసం కనీసం హెల్మెట్ ధరించడంలేదని అన్నారు. ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. ఇక నుంచి శుభకార్యాలకు, పుట్టిన రోజు సంద ర్భంగా ఇతరులకు గిఫ్ట్‌గా హెల్మెట్ ఇవ్వడం చేస్తే అది అనేక మంది ప్రాణా లను రక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం కొంతమంది హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వ ర్యంలో ఉచితంగా హెల్మెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డా హెచ్ అమర రంగేశ్వరరావు, తుళ్ళూరు ట్రాఫిక్ సీఐ బీ కోటేశ్వరరావు, అసిస్టెంట్ సెక్రెటరీ ఎన్ జెజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ, ఎన్‌ఐపీహెచ్‌ఎం అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య)జనవరి 7(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్ మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మంగళవారం ఈ విషయాన్ని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, జాయింట్ డైరక్టర్ డాక్టర్ విధు కేపీలతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సం బంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఎన్ఈపీ 2020లో పొందుపరిచిన మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీస్ (ఎమ్ఈఆర్‌యూ) కాన్సెప్ట్‌ను, అకడమిక్ ప్రోగ్రామ్స్‌ను, కరిక్యులమ్ డిజైన్‌ను చేస్తామన్నారు. అంతేకాకుండా ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, ఫ్యాకల్టీ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్, పేటెంట్స్, ప్రాజెక్టులు, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చని అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డెరక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవ గాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉంద న్నారు. అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో శిక్షణ ఇవ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, డీన్స్ పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

- దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో ఘటన
- రూ. 30 లక్షల విలువైన బంగారం, వెండి చోరీ



దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

దాచేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయి. పండుగలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లే కుటుంబాలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దొంగతనాలతో లక్షల రూపాయల సొమ్ము కోల్పోయిన బాధితులు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దాచేపల్లి మండలం దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో నివాసముంటున్న జీఎం శంకర నారాయణరెడ్డి కుటుంబసభ్యులు తమ స్వగ్రామం రాజమండ్రి వెళ్లారు. ఆ ఇంటికి దగ్గరలో నివాసముంటున్న మరో అధికారి వీర ప్రకాశరావు కూడా తన కుటుంబ సభ్యులతో షిర్డీ వెళ్లారు. ఈ విషయాన్ని పసిగట్టిన గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడి బీరువాలో దాచిన బంగారం, వెండి సామాన్లు అపహరించారు. శంకరనారాయణ రెడ్డి ఇంట్లో 190 గ్రాములు, వీర ప్రకాసరావు ఇంట్లో 170 గ్రాములు బంగారం చోరీ జరిగింది. ఆయా కుటుంబాల వారు తిరిగి ఇళ్లకు చేరుకున్న తర్వాత చోరీ జరిగినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాచేపల్లి ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో గృహాలకు తాళాలు వేసి తమ సొంత ఊళ్లకు వెళ్లే వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తగిన భద్రత తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని వివరించారు. గతంలో కూడా దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో లక్షల రూపాయల విలువైన బంగారం, నగదు దొంగతనం జరిగింది. ఇంత వరకు ఆయా చోరీలకు సంబంధించిన విషయాల్లో ఎటువంటి పురోగతి లేదని స్థానికులు, బాధితులు విమర్శిస్తున్నారు.

దారిదోపిడి కేసులో నిందితుల అరెస్టు



దారి దోపిడీ కేసులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు, సీఐ శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, జనవరి 07 (ఆంధ్రజ్యోతి) : దారిదోపిడి కేసులో నింది తులను అరెస్ట్ చేసినట్లు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వివరించారు. పట్టణంలోని ధనలక్ష్మీ రైస్ మిల్లు వద్ద లారీలో ఊక నింపుకుని దుగ్గిరాల కాఫీ ఫ్యాక్టరీకి వెళుతుండగా, బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద లారీని ఇద్దరు వ్యక్తులు బారికేడ్ అడ్డం పెట్టి ఆపారు. మరో ఇద్దరు వచ్చి లారీ డ్రైవర్ రావూరి వాసుతోపాటు ముగ్గురు కూలీలను కత్తులతో దాడి చేసి గాయపరిచి, వారి వద్ద ఉన్న రూ. 1500, సెల్‌ఫోన్‌లు దొంగిలించారు. దీంతో, రావూరి వాసు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం గాలించి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులలో పట్టణంలోని రైలుపేటకు చెందిన షేక్ మదార్, అంబేద్కర్ నగర్‌కు చెందిన చేగూడి ఆనందబాబు, రైలుపేటకు చెందిన మొహమ్మద్ ఇక్బాల్, శాంతినగర్‌కు చెందిన షేక్ బాషీద్‌లు ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. చెడు వ్యసనాలు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని వారు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రైళ్లల్లో మొబైల్ ఫోన్‌లు దొంగతనం చేస్తుంటారని, వాటిని అమ్ముకొని జల్సాలు చేస్తుంటారని చెప్పారు. వీరిలో 1,2 వారిపై చీరాల, బాపట్ల, తెనాలి జీఆర్‌పీ పోలీసు స్టేషన్లలో, బాపట్లటౌన్, వేటపాలెం పోలీసుస్టేషన్, చీరాల 1వ పట్టణ పోలీసుస్టేషన్, పొన్నూరు టౌన్ పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నారు. చోరీ చేసిన ఫోన్లను నిందితులు పట్టణంలోని మొబైల్‌షాపు వద్ద విక్రయించేదుకు వచ్చిన సమయంలో రూరల్ సీఐ కే శ్రీనివాసరావు, ఎస్సై ఎం.శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేసినటు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరించారు.

ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి మృతి



మృతుడు సత్యనారాయణ

మాచవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మాచ వరంలో మంగళ వారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన అంబటి సత్యనారాయణ(40) పొలానికి నీరు పెట్టేందుకు వెళ్ళాడు. ప్రమాదవశాత్తు కాలు వలో పడి పోవటంతో నీటిలో మునిగి ఊపిరి ఆడక చని పోయి నట్టు తెలి పారు. అక్కడ ఉన్న వారు చూసి ఈ సమాచారాన్ని సత్య నారా యణ బంధువులకు చేరవేశారు. సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించే సరికే చనిపోయి ఉన్నాడు. ఎస్ఐ సతీష్ తన సిబ్బం దితో సంఘటనా స్థలానికి వెళ్లారు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి



గంజనబోయిన లింగయ్య (ఫైల్)

ఈపూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలోకి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరులో మంగళవారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఈపూరుకి చెందిన గంజనబోయిన లింగయ్య (55) అంగలూరు మేజర్ కాలువలో నీటిని తీసుకునేందుకు యత్నిస్తుండగా కాలు జారి నీటిలో పడ్డాడు. నీటి ఉధృతికి కొద్ది దూరం కొట్టుకుపోయాడు. కాలు వలో ఆయన మృత దేహాన్ని గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



ప్రసంగిస్తున్న మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

షెడ్యూలు కులాల అభ్యున్నతికి కృషి చేయాలి

తాడేపల్లి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): షెడ్యూలు కులాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు.ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు కులాల సహకార, ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఎండీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. డైరెక్టర్లు కూడా చిత్త శుద్ధితో తమ విధులు నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయకుమార్ పాల్గొన్నారు.



యువజనోత్సవాలకు ఎంపికైన విద్యార్థులతో వర్సిటీ అధికారులు

జాతీయ యువజన ఉత్సవాలకు ఏఎన్‌యూ విద్యార్థులు

పెదకాకాని, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లోని విద్యార్థులు మార్చి 5వ తేదీన నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో జరిగే జాతీయ యువజన ఉత్సవ పోటీలలో పాల్గొననున్నట్లు వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య కే. గంగాధరరావు తెలిపారు. గత ఏడాది డిసెంబరు 26 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన సౌత్ జోన్ యువజన ఉత్సవాల పోటీలలో విశ్వవిద్యాలయ విద్యార్థులు ఆరు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు విజేతలను వీసీ అభినందించారు. సౌత్ జోన్ స్థాయిలో వర్సిటీ పేరు ప్రతిష్ఠలను పెంచిన విద్యార్థులు, జాతీయ స్థాయిలో కూడా ఇనుమడింపజేయాలని కోరారు. ఈ సందర్భంగా యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్, డాక్టర్ రమీ బేగంలను అభినందించారు. యువజన ఉత్సవాలలో వర్సిటీ విద్యార్థులు స్పాట్ ఫోటోగ్రఫీ, మెహందీ, మైమ్, ఇన్ స్టాలేషన్, కార్టూనింగ్ విభాగాల్లో పతకాలు సాధించినట్లు యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కే. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం అందజేశారు.

ఆప్కో చేనేత వస్త్రములపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు

గుంటూరు సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని రకాల చేనేత వస్త్రములపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఇవ్వనున్నట్లు ఆప్కో వాణిజ్య అధికారి డీ వెంకటేశ్వర్లు తెలిపారు. చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పి ంచేందుకు, అధిక విక్రయాల కోసం ఆప్కో వస్త్రాలపై తగ్గింపును ప్రకటించి నట్లు తెలిపారు. మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి మంగళ గిరి చేనేత చీరలు, బెడ్‌షీట్స్, లుంగీస్, టవల్స్ రెడీమేడ్ వస్త్రములు అందుబాటులో ఉంటాయని అన్నారు. అన్ని ఆప్కో విక్రయశాలలతో పాటు, ఆప్కో హ్యాండ్లూమ్స్. కామ్ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ సంస్థలలో వస్త్రాలు కొను గోలు చేయవచ్చునని తెలిపారు.

రూ. 60 లక్షలు ఇవ్వని వారిపై చీటింగ్ కేసు

ప్రత్తిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకుని ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న వారిపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాతమల్లాయపాలెంకి చెందిన సూరగాని గోపిరెడ్డికి గుంటూరుకు చెందిన గాలం శ్రీనివాసరావు, గాలం కార్తీక్, గాలం రేవతిలతో గత ఏడు సంవత్సరాలుగా పరిచయం ఉంది. ఈ క్రమంలో వ్యాపారం నిమిత్తం 2022 నుంచి వివిధ దఫాలుగా గోపిరెడ్డి వద్ద నుంచి రూ. 60 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే, ఈ సొమ్మును గోపిరెడ్డి తన బంధువుల వద్ద నుంచి తీసుకుని వారికి ఇచ్చారు. కొంత కాలంగా తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని అడుగుతుండగా వారు తప్పించుకు తిరుగుతున్నారు. గోపిరెడ్డి అప్పుతీసుకున్న వారి నుంచి ఒత్తిడి రావడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు తన వద్ద అప్పు తీసుకున్న ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

రేపు గుంటూరులో ఏపీ సీపీడీపీఎల్ సీఎండీ పర్యటన

- సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ పటాన్‌శెట్టి రవి ఈ నెల 9న గుంటూరు పర్యటనకు రానున్నారు. ఈ మేరకు విజయవాడలోని సీఎండీ కార్యాలయ అధికారులు గుంటూరు సర్కిల్ కార్యాలయ అధికారులకు సమాచారం అందించారు. విజయవాడ కేంద్ర కార్యాలయం నుంచి సీఎండీ నేరుగా గుంటూరులోని సంగడిగుంటలో ఉన్న విద్యుత్ భవన్‌కు చేరుకోనున్నారు. గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ కేవీఎల్ ఎన్‌మూర్తితో కలిసి సీఎండీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించ నున్నారు. విభజిత గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్ అధికారులతో సమీక్షించనున్నారు. రెవెన్యూ వసూళ్ళు పనుల పురోగతి,ప్రధానమంత్రి సూర్యఘర్ వంటి అంశాలను కూడా సమీక్షించనున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

72,819 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 76,310 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 72,819 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్య దర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 55,385 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	8000	13500
నంబరు. 5	10000	14000	నంబరు. 5	8000	13000
273	9000	11500	273	-	-
341	7500	14500	341	12000	12000
4884	9000	11500	4884	-	-
సూపర్ 10	10500	10500	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7200	16500	తేజ	7500	15500
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	8000	12000
దేవనూరుడీలక్స్	9000	14500	దేవనూరుడీలక్స్	9500	9500
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	4000	9000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నెలాఖరుకు మార్క్‌ఫెడ్ ద్వారా కంది కొనుగోలు : ఏవో

దుర్గి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ద్వారా ఈనెలాఖరుకు కంది కొనుగోలు చేస్తామని ఏవో అన్నారు. మంగళవారం మండలంలోని ఆత్మకూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామంలోని పత్తి, మిర్చి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కంది రైతులు తమ పంటను మధ్యవర్తులకు కాకుండా మార్క్‌ఫెడ్‌లో అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది దిలీప్, చందు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మహిళా నేత సస్పెన్షన్

కారంపూడి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ సిద్ధాంతాలను ఉల్లంఘిస్తూ, పార్టీ నియమాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన ఉన్నం అనురాధను టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాళ్లపాటి శ్రీధర్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ సూచనల మేరకు అనురాధను సస్పెండ్ చేశారు. అలాగే ఆమె టీడీపీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేశారు.

న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయ పరిరక్షణ చట్టాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయ దేవత విగ్రహం వద్ద తమ నిరసనను వ్యక్తం చేశారు. పొన్నూరులో న్యాయవాది వాదితో అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంభాల అనీల్ కుమార్, దివ్వెల శ్రీనివాసరావు, సయ్యద్ అబ్దుల్ రహీం, పాపారావు, జానీ ఖాజావలి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

26న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

సత్తెనపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 26వ తేదీ అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ విజయకుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. బస్సు 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సత్తెనపల్లి బస్టాండ్ నుంచి బయలుదేరి 27వ తేదీ తెల్లవారుజామున అరుణాచలంకు చేరుతుందన్నారు. దర్శనం అనంతరం తిరిగి కంచి మీదుగా 28వ తేదీ ఉదయం సత్తెనపల్లి చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రాను పోను ఒక్కొక్కరికి రూ.2100 అన్నారు. సత్తెనపల్లి ప్రాంతంలోని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 9959225429, 7382897583లలో సంప్రదించాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

రెంటచింతల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన పేరం బ్రహ్మారెడ్డి అదృశ్యమైనట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. ధాన్యం, కందులు విక్రయించడానికి నెల్లూరు, కడప జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఈనెల 1న వెళ్లాడు. 4వ తేదీ నుంచి సెల్ స్విచ్ఛాఫ్ అయింది. ఎక్కడ ఉందనే సమాచారం లేదన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బొడ్డును కోయబోయి.. పసిపాప కాలివేలుకు గాయం

మాచర్లటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాన్పుకొచ్చిన గర్భిణికి డాక్టర్ ఆపరేషన్ చేసి బిడ్డను తీసే క్రమంలో బొడ్డును కోయబోయి బిడ్డ కాలి వేలును గాయపరిచిన ఘటన సోమవారం రాత్రి మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని 8వ వార్డుకు చెందిన లతా నాగలక్ష్మి సోమవారం కాన్పు కోసం పట్టణంలోని ఓ హాస్పిటల్‌కు వచ్చింది. రాత్రి 9.30 గంటల సమయంలో డాక్టర్ సౌమ్య ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు. ఈ క్రమంలో బిడ్డ కుడి కాలు బొటన వేలుకు గాయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో దగ్గర్లో ఉన్న పిల్లల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం పంపారు. ప్రస్తుతం బిడ్డ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. డాక్టర్ అసిస్టెంట్ బొడ్డు కట్ చేసేటప్పుడు బిడ్డకు గాయమై ఉంటుందని ఆస్పత్రి నిర్వాహకులు చెబుతున్నారు.


ముగ్గురిపై బైండోవర్

నకరికల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేజర్ల గ్రామానికి చెందిన ముగ్గురిని బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ సోమయ్య తెలిపారు. మంగళవారం చేజర్ల అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రెండొందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు.

జూదస్థావరంపై దాడి

రెంటచింతల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మంచికల్లు అడ్డరోడ్డు సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులపై ఎస్ఐ సీహెచ్ నాగార్జున మంగళవారం రాత్రి దాడి చేశారు. సేకరించిన వివరాల ప్రకారం వరి కోసిన పొలాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ సిబ్బందితో దాడి చేశారు. 17 ద్విచక్రవాహనాలు, 9 వేల నగదు, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

డాక్టర్ శ్రీనివాసరావుకు చెక్కు అందజేత



చెక్కును అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాసరావు

గురజాలటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐఎంఏ సభ్యుడిగా ఉన్న పట్టణానికి చెందిన డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావు తండ్రి రామ్మూర్తి గతేడాది సెప్టెంబరు 2వ తేదీన మృతి చెందాడు. ఐఎంఏ నేషనల్ సోషల్ సెక్యూరిటీ స్కీం తరపున రూ.11,37,080ల నగదు చెక్కును మంగళవారం పట్టణంలో శ్రీనివాసరావుకు అందించారు. చెక్కును అందించిన వారిలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ బొర్రా రాంప్రసాద్‌లు ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దామని ఆ దిశగా టీచర్లు విద్యార్థులను చైతన్యవంతం చేసేలా పని చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. మంగళవారం రెంటచింతలలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలిపే పోస్టర్ల ను ఎమ్మెల్యే విడుదల చేశారు. వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాల నిర్మాణానికి నాబార్డు ద్వారా రూ.4.5 కోట్ల మంజూరయ్యాయని, 447/3 సర్వే నెంబర్లో 5 ఎకరాలు కేటాయించాలని తహసీల్దార్ నగేష్‌ను కోరారు. విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్, గ్లాసులు, ప్లేట్లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్స్‌ను ఆసక్తిగా ఎమ్మెల్యే తిలకించారు. ప్రిన్సిపాల్ మోహన్ నేతృత్వంలో టీచర్లంతా ఎమ్మెల్యేను సత్కరించారు. ఎంఈవో 2 శివనాగేశ్వరరావు వినతిని అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నగేష్, ఎంపీడీవో సరోజని, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి, టీడీపీ నేతలు గొంటు ఆదిరెడ్డి, అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీను, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

● రెంటచింతలలో ఉపాధి హామీ నిధులతో మూడు కాలనీల్లో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామంలో నీటి సమస్య లేకుండా ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెప్పారు.

● నిర్మాణంలో ఉన్న గోలి వాగు బ్రిడ్జిని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. 167 ఏడీ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు ఈ నెలాఖరు నుంచి వాడుకలోకి వస్తాయన్నారు.

ముఖద్వారం ప్రారంభం

రెంటచింతలలో వైసీపీ నేతల చేతుల్లో ధ్వంసమై పునర్నిర్మించిన ముఖద్వారాన్ని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతల అవినీతి, అరాచకాలు, భూ అక్రమణలు, అక్రమ కేసులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర హస్త కళల అభివృద్ధి చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి, సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, గొంటు సుమంత్‌రెడ్డి, రవికిరణ్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, శౌరెడ్డి, రాయపరెడ్డి, తుమ్మా జోజిరెడ్డి, చేర్రెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచులు మండలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి, గొట్టం ప్రమీలగురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

వెల్దుర్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. హైవే ప్రధాన రహదారి బంగ్లా నుంచి అచ్చంబావి వరకు రూ.80 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డును పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండల పరిధిలో రూ.2.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. ఈనెలాఖరులోగా పనులు పూర్తవుతాయన్నారు. ఎమ్మెల్యే వెంట తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, చిరంజీవిరెడ్డి తదితరులున్నారు.

తప్పుడు పనులు చేస్తే తాట తీస్తా : ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తన పేరు చెప్పి ఎవరైనా తప్పుడు పనులు చేస్తే తాట తీస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసే వారిని నమ్మవద్దన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు అక్రమార్కులు సామాన్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని ప్రజలు నమ్మవద్దన్నారు. ఇటీవల సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న స్టాఫ్ నర్సును ఒక యువకుడు తన పేరు చెప్పి బెదిరించాడని, అలా ఎవరైనా బెదిరిస్తే వెంటనే తన దృష్టికి తేవటం గానీ, పోలీసులకైనా ఫిర్యాదు చేయాలని ఉద్యోగులకు కన్నా సూచించారు.



28వ వార్డు సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఉరుసు మహోత్సవంలో..

పట్టణంలోని 28వ వార్డులో మంగళవారం జరిగిన అజ్మీర్ దర్గా ఉరుసు మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మత పెద్దలతో కలసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వార్డులోని సచివాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. సిబ్బంది గురించి ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది ఎవరైనా క్రమశిక్షణా రహితంగా పని చేసినట్లయితే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల వద్ద డబ్బులు అడిగి తీసుకున్నా, సేవలు అందించటంలో నిర్లక్ష్యం వహించినా సహించేదే లేదన్నారు. సచివాలయంలో పని చేస్తున్న సిబ్బంది కొంత మంది విధులకు గైర్హాజరవుతారని ఎమ్మెల్యే దృష్టికి రావటంతో మునిసిపల్ కమిషనర్ షమ్మితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పని వేళల్లో ఎవరూ కూడా సచివాలయాన్ని వదిలి వెళ్లటానికి వీల్లేదన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగి సచివాలయ సమయ పాలన పాటించాలన్నారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర నాయకుడు ఎలినేడి రామస్వామి, పలువురు నేతలు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పని తీరు మెరుగుపరుచుకోవాలి

● మండలపరిషత్ సమావేశంలో అధికారుల సూచన



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ జెమీలా

క్రోసూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలో అంగన్‌వాడీల పనితీరు మెరుగుపరుచుకోవాలని, సమయపాలన పాటించాలని అధికారులు సూచించారు. కొంత మంది సభ్యులు మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పని చేయటం లేదని, టీచర్లు అందుబాటులో ఉండటం లేదని, ప్రభుత్వం అందజేసే ప్రయోజనాలు సక్రమంగా పిల్లలకు గానీ, గర్భిణులు, బాలింతలకు గానీ అందించడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దొడ్లేరు, అనంతవరం, గుడిపాడు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల పని తీరు సక్రమంగా లేదని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. నాగవరం అంగన్‌వాడీ కేంద్రానికి దారి సక్రమంగా లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, కేంద్రాల పనితీరు సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీడీవో జీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని, వాటితో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్లు, వానపాముల కేంద్రాలు నిర్మాణం జరుగుతున్నట్టు తెలిపారు. కొంత మంది సభ్యులు హౌసింగ్ బిల్లులు సక్రమంగా రాలేదని, నూతన గృహాలను కూడా మంజూరు చేయాలని సమావేశంలో అడిగారు. వ్యవసాయాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తమ దిగుబడులు తీసుకు వచ్చే రైతులు ముందుగా పేర్లు రిజిస్టర్ చేసుకోవటంతో పాటు ఈకేవైసీ నమోదు పూర్తి చేసుకోవాలన్నారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, కెనాల్స్ తదితర అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంపై సభ్యులు ప్రశ్నించారు. సమావేశానికి ఎంపీపీ పెరుమాళ్ళపల్లి కోటయ్య అధ్యక్షత వహించగా జడ్పీటీసీ సభ్యురాలు జమీలా, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు మాట్లాడారు.

బోగస్ పింఛన్ల ఏరివేత

మాచర్లటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణం, కారంపూడి మండలపరిధిలో అధికారులు మంగళవారం పింఛన్ వెరిఫికేషన్ చేశారు. వైద్యులతో కూడిన అధికారుల బృందం మంచానికే పరిమితమైన పింఛన్‌దారులను పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ వెరిఫికేషన్ బృందంలో గుంటూరు జీజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ గోపాలకృష్ణ, కైకలూరు ప్రభుత్వ వైద్యుడు శ్రీనివాసరావు, డాక్టర్ వెన్నీ, మాచర్ల పురపాలక సంఘం కమిషనర్ వేణుబాబు, వెలుగు ఏపీఎం శివకుమార్, మండల కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులున్నారు.

● **పిడుగురాళ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):** పిడుగురాళ్ల పట్టణంలో రూ.15 వేల పింఛన్ పొందుతున్న 32 మంది సర్టిఫికెట్లను మంగళవారం వైద్యాధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. రెండు రోజులుగా పిడుగురాళ్ల పట్టణం, రూరల్ గ్రామాల్లో రూ.15 వేలు పొందుతున్న పింఛన్లను జిల్లా వైద్యశాఖ ఏర్పాటు చేసిన వైద్యబృందం నేరుగా పింఛన్‌దారుడి ఇంటికి వెళ్లి పింఛను స్థితిగతులను, సర్టిఫికెట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. వైసీపీ హయాంలో అడ్డగోలుగా మెడికల్ సర్టిఫికెట్లు పొంది రూ.15 వేలు పింఛను పొందుతున్న వారిలో కొన్నింటిని రద్దు చేసేందుకు వైద్యబృందం సిఫార్సు చేస్తోంది.



మాచర్ల పట్టణంలో పింఛన్ వెరిఫికేషన్‌లో అధికారులు


దైద అమరలింగేశ్వరస్వామి హుండీ ధ్వంసం రూ. 8 వేలు అపహరణ

గురజాలటౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలో ఉన్న శ్రీగంగా పార్వతి సమేత అమరలింగేశ్వరస్వామి హుండీని సోమవారం రాత్రి ఓ వ్యక్తి ధ్వంసం చేసి రూ.8 వేలు అపహరించాడు. మంగళవారం ఉదయం వాచ్‌మెన్ బిలం తలుపులు తెరిచి చూడగా హుండీ ధ్వంసమైనట్లు గుర్తించి ఈవో పూర్ణచంద్రరావుకు సమాచారం అందించారు. ఈమేరకు ఈవో పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఆలయానికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడ్ని గుర్తించారు. పులిపాడు గ్రామస్థులు నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అతడి వివరాలు వెల్లడి కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆవుల భాస్కర్ తెలిపారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు అందజేత

మాచర్ల రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజన ప్లేట్లు అందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని రోటరీ డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య అన్నారు. కార్యక్రమంలో నాగూర్‌వలి, కృష్ణకుమారి, సురేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు



షిర్డీసాయి మందిరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పిడుగురాళ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయి మందిరంలో ధనుర్మాస పూజల్లో భాగంగా 23 రోజులుగా విశేష పూజలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా పట్టణంలోని భక్తులు ధనుర్మాస పూజలో పాల్గొన్నారు. దేవాలయ అర్చకుడు వల్లూరి వాసుదేవ శర్మ, కారంపూడి కృష్ణకిషోర్‌లు ధనుర్మాస పూజలను నిర్వహిస్తున్నారు. సంక్రాంతి వరకు దేవాలయంలో ధనుర్మాస పూజలు కొనసాగుతాయని తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పుల్లయ్య

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి) భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా అమరావతికి చెందిన పుల్లయ్యను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం రాత్రి అమరావతిలో జరిగిన కార్యక్రమంలో సుధాకర్‌బాబు, ఎంపీపీ హనుమంతరావులు నియామకపత్రాన్ని పుల్లయ్యకు అందజేశారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

● జిల్లా మలేరియా అధికారి రవీంద్ర

రాజుపాలెం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. మంగళవారం రాజుపాలెంలో ఉన్న ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫ్రైడే డ్రైడే చేయాలని పిలుపునిచ్చారు. దీని వల్ల పరిసరాలను శుభ్రం చేసుకోవటంతో పాటు, సీజనల్ వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవితేజ నాయక్, పర్యవేక్షకులు ఉషారాణి, కమ్యునిటీ హెల్త్ అధికారులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రెవెన్యూ గ్రామసభలతో సమస్యల పరిష్కారం



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ డానియేలు

పెదకూరపాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల ద్వారా వచ్చిన అర్జీలను పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ మీసాల డానియేలు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, సర్పంచ్ గుడిపూడి రాజులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ గ్రామసభలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని స్థితి గతులపై తహసీల్దార్ తొలుత పర్యవేక్షించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగినులకు ఆటల పోటీలు

క్రోసూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా క్రోసూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని మహిళా ఉద్యోగులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్ డాక్టర్ సిరి చందన పోటీలను ప్రారంభించి క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయన్నారు. ఆరోగ్యకేంద్రం పరిధిలోని మహిళా ఉద్యోగులు, ఏఎన్ఎంలు పోటీల్లో పాల్గొన్నారు. ఉద్యోగులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఈనెల 11వ తేదీన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు పోటీల నిర్వాహకుడు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ తెలిపారు.

సీసీ రోడ్డు పనులు వేగవంతం



సీసీ రోడ్డు నిర్మాణం కోసం జేసీబీతో మరమ్మతులు

బెల్లంకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల కు వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం మంగళవారం జేసీబీ సహకారంతో పనులను ప్రారంభించారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ జ్యోతి సముద్రం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు షరీఫ్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిధులతో పనులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, ఉపసర్పంచ్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కాంతారావుకు నివాళి

మాచర్ల రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మంగళవారం ఎంఈవో కాంతారావు సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం

● ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు



సత్తెనపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు తెలియజేశారు. ఆయన మంగళవారం ఆంధ్రజ్యోతితో ఫటాఫట్‌లో మరిన్ని వివరాల గురించి మాట్లాడారు.



2024 ఔట్ పేషెంట్స్ ఎంత మంది పరీక్షలు చేయించుకున్నారు?

జ: 1,67,967 మందిలో 12,843 మంది ఇన్‌పేషెంట్లకు వైద్యసేవలు అందించాం.

2024లో ఎన్ని ప్రసవాలు జరిగాయి?

జ : 1572 ప్రసవాలు జరిగాయి.

ఎన్ని రక్త పరీక్షలు జరిగాయి?

జ : 7,19,895 రక్త పరీక్షలు జరిగాయి.

ఎంత మంది రోగులకు ఎక్స్‌రేలు, ఈసీజీలు తీశారు?

జ : 17,616 మంది రోగులకు ఎక్స్‌రేలు, 6,450 మందికి ఈసీజీలు తీశాం.

ఎంత మంది గర్భిణులకు స్కానింగ్ చేశారు?

జ : 7,247 మందికి స్కానింగ్‌లు తీశాం.

ఎంత మంది రోగులకు ఫిజియో థెరపీ అందించారు?

జ : 9,301 మంది రోగులకు ఫిజియో థెరపీ సేవలు అందించాం.

కూటమి ప్రభుత్వంతోనే నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్

ముప్పాళ్ళ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెంలోని జగన్నాథ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ కూటమి ఎన్నికల మేనిఫెస్టోల్లో దేవాలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం అమలు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.25వేలు వేతనం ప్రకటించినందుకు ప్రతి దేవాలయాల్లో, ట్రస్ట్ బోర్డులో నాయి బ్రాహ్మణులకు అవకాశం కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గంగాధర్‌ను ముప్పాళ్ళ నాయీ బ్రాహ్మణులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరావు, గంగానపల్లి నరసింహారావు, కూరపాటి రాఘవయ్య, తుపాకుల పెద్ద కేశవులు, శివరామకృష్ణయ్య, బాలకృష్ణ, సత్యనారాయణ, గంధం నరసింహారావు, ఈపూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగలు, నగదు అపహరించిన నిందితుల అరెస్టు

సత్తెనపల్లి రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళను బెదిరించి ఆమె మెడలోని బంగారపు గొలు సు, నగదును అపహరించిన నిందితులను అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ పీ శ్రీనివాసరావు తెలిపారు. రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. పట్ట ణంలోని రంగాకాలనీకి చెందిన మొగిలిశెట్టి మల్లేశ్వరి డిసెంబరు 26న పట్టణంలోని అమరావతి బస్టాండ్ వద్ద బస్సు కోసం నిల్చుంది. ఈ సమయంలో ఇద్దరు ఆటోలో వచ్చి ఆమెను ఆటో ఎక్కించుకుని నందిగామ గ్రామ శివారు వద్దకు వెళ్లగానే ఆటో ఆపి మల్లేశ్వరిని బెదిరించి ఆమె వద్ద ఉన్న బంగారపు గొలుసు, నగదును లాక్కొని పరారయ్యారు. జరిగిన ఘటనను మల్లేశ్వరి వెంటనే పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఫిరంగిపురంనకు చెందిన నన్నెబోయిన చిరంజీవి, నగరాలు, గుంటూరుకు చెందిన తమ్మిశెట్టి వినోద్‌లను గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్లో అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. వారి నుంచి గొలుసు, రూ.1050 నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. వారిని కోర్టుకు హాజరు పరచనున్నట్టు ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్ఐ అమీరుద్దీన్, హెచ్‌సీ గుమ్మా నాగేశ్వరరావు, పీసీ ఓర్సు శ్రీనివాసరావు, హెచ్‌జీ నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు మోటారు ఏర్పాటు చేసిన టీడీపీ నేతలు

దుర్గి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని యాదవ బజారులో నీటి బోరు మోటారు కాలిపోయి తాగునీటి సమస్య తలెత్తింది. టీడీపీ సీనియర్ నేత చిరుమామిళ్ల కృష్ణయ్య, మండల క్లస్టర్ ఇన్‌చార్జి సింగు నాగేశ్వరరావులు మంగళవారం నూతన మోటారు కొనుగోలు చేసి తాగునీటిని పునరుద్ధరించారు. వారికి యాదవబజారు వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజారావు, నీటి ఆపరేటర్లు, కూటమి నేతలు పాల్గొన్నారు.

కుళాయి నీరు వృథా చేస్తే డమ్మీ చేస్తాం : మున్సిపల్ కమిషనర్

మాచర్లటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కుళాయిల నుంచి వస్తున్న నీటిని వృథా చేస్తే సదరు నీటి కుళాయిని డమ్మీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు హెచ్చరించారు. పట్టణంలోని 18వ వార్డులో మంగళవారం ఆయన సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. పలుచోట్ల కుళాయి నీరు వృథాగా పోవడాన్ని గమనించారు. మున్సిపల్ నీరు అవసరం లేనివారు డమ్మీ చేయించుకోవాలన్నారు. అనవసరంగా నీటిని వృథాగా వదిలితే వారి ట్యాపును డమ్మీ చేయమని సిబ్బందిని ఆదేశించారు.

టిడ్కో గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

● సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

మాచర్లటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కొమెర వీరాస్వామి భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో టిడ్కో గృహాల నిర్మాణాలు 70 శాతం పూర్తయ్యాయని, 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వాటిని విస్మరించారన్నారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి రాగానే టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీనిచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు హామీ నిలబెట్టుకోవాలని శ్రీనివాసరెడ్డి కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు పాల్గొన్నారు.

రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలి

పెదకూరపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి ఈ పంట నమోదు చేసుకోవాలని ఏవో ఇంజనం శాంతి అన్నారు. మండలంలోని గారపాడు, హుస్సేన్ నగరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీలో వేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు యశస్విని, రాజు, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



పందెం కోళ్లకు భలే గిరాకీ !



రసంగి



కోడిపుంజులకు శిక్షణ నిస్తున్న శిక్షకులు



సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ.. పందేలకు కోళ్లను సన్నద్ధం చేస్తున్నారు పందెంరాయుళ్ళు. ఇందుకోసం వివిధ రకాల పుంజులను సిద్ధం చేసుకుంటున్నారు. పండుగకు అయిదు నెలల ముందు నుంచే అన్ని జాతుల కోడిపుంజులను తీసుకువచ్చి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి కోడి పుంజులకు బలవర్ధక ఆహారమైన డ్రై ఫ్రూట్స్ తినిపిస్తూ పెంచుతున్నారు. అలాగే ఆయా పుంజులు బరిలో అన్నివిధాలా తట్టుకొని నిలిచి గెలవడం కోసం బలవర్ధకమైన ఆహారంతోపాటు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. దీంతో పందెం రాయుళ్లు సిద్ధమైన కోళ్లను రూ. లక్షలు పెట్టి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- సంక్రాంతి బరికి సిద్ధం చేస్తున్న నిర్వాహకులు
- డ్రై ఫ్రూట్స్‌తో ప్రత్యేక ఆహారం, శిక్షణ
- కుక్కుటి శాస్త్రం ద్వారా గెలుపోటములు
- లక్షలు పలుకుతున్న కోడి పుంజులు

రేపల్లె, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో నిర్వాహకులు పందె కోళ్లను సన్నద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో పుంజు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. తీర ప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో కొన్ని సంవత్సరాలుగా కోడిపందాలు నిర్వహిస్తున్నారు. ఈ పందాలకు తెలంగాణా రాష్ట్రం నుంచి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి పందెం రాయుళ్ళు తరలి వస్తారు. రానున్న సంక్రాంతికి చెరుకుపల్లిమండలం పూషడపువారిపాలెం, నగరం, రేపల్లె మండలం గుడ్డికాయలంకలో కోడిపందాలు వేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో వారం రోజులుగా తర్ఫీదులో భాగంగా పుంజులకు పందేలు నిర్వహిస్తున్నారు. అలాగే వాటిని సంక్రాంతి బరిలో నిలిపేందుకు గట్టి శిక్షణను ఇస్తున్నారు.

ప్రత్యేక ఆహారం, వ్యాయామం

నిత్యం ముగ్గురు శిక్షకులు పందెపు కోళ్ళ సంరక్షణ చూస్తుంటారు. ఉదయాన్నే 5 గంటల కల్లా కోడి పుంజులను బయటకు తీసి కాసేపు చల్లటి పైరు గాలి శ్వాస తీసుకునేలా చేసి అనంతరం చుట్టూ వలయంగా ఏర్పాటు చేసి కోడి పుంజులను దాంట్లోకి వదిలి పరుగెత్తిస్తారు. వాటికి పేరుకుపోయిన కొవ్వును బయటకు తీసి స్విమ్మింగ్ చేయిస్తారు.



పుంజులు అలసిపోవటంతో పాలల్లో నానబెట్టిన బాదం పప్పు, పిస్తా పప్పు, ఖర్జూర, కిస్‌మిస్‌లను కోళ్ళకు పెట్టి సిరంజి ద్వారా పాలను పట్టిస్తారు. ఒక్కో పుంజుకు రోజుకు వంద నుండి రూ.700 వరకు ఖర్చు చేసి మానవుడి కంటే అతి సున్నితంగా పందెపు కోళ్ళను తయారు చేయటంలో వారు తీసుకునే జాగ్రత్తలు చూస్తే ఆశ్చర్యం చెందాల్సిందే. నిత్యం కోళ్లకు బలమైన ఆహారంతో పాటు వ్యాయామం చేయించి సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా, కోడి పందాలు ఎప్పుడు వేద్దామా అనే రీతిలో పుంజులను తయారు చేస్తారు.

కాకి డేగ



నెమలి కక్కెర



నల్ల కక్కెర



గాజు కక్కెర



అబ్రాస్



ఎర్ర డేగ



కోడి పుంజుల్లోని రకాలు..

కోడి పుంజుల్లో తెల్ల నెమలి, కోడి నెమలి, గౌడ నెమలి, కాకి డేగ, నెమలి కక్కెర, నల్ల కక్కెర, రసంగి, గాజు కక్కురాయి, అబ్రాస్, ఎర్రడేగ వంటి జాతులు వుంటాయి. వీటిల్లో తెల్ల నెమలి, గౌడ నెమలి, రసంగి, అబ్రాస్ పుంజులు ఎంతటి పందానైన్నా సులువుగా నెగ్గుతాయి. పందానికి తయారయ్యే పుంజులకు రూ.50 వేల నుంచి లక్షరూపాయలకుపైనే ఖర్చు చేస్తారు. వీటికి బలమైన ఆహారంతోపాటు ప్రత్యేక శిక్షకుడిని పెట్టి శిక్షణ నివ్వటంతోపాటు పందెం కోడి తయారయ్యేలా చేస్తారు. ఈ కోళ్ళన్నీ పూర్తిస్థాయిలో పందానికి సిద్ధమైతే లక్ష రూపాయలు పైనే పలుకుతుందని శిక్షకులు చెబుతున్నారు.

కోడి పందాలకు కుక్కుటి శాస్త్రం..

కోడి పందాల్లో ప్రావీణ్యం వున్న వారు కుక్కుటి శాస్త్రాన్ని అనుసరిస్తారు. పందెం వేసే రోజున నక్షత్రాన్ని బట్టి తారాబలం చూసి కోడి రంగు, జాతిని ఎంపిక చేసి ఆరోజున ఏ పుంజుతో పందెం వేయాలో ఆ రంగు వున్న కోడి పుంజుతోనే పందాలు వేయటం జరుగుతుంది. 13వ తేదీ భోగి సందర్భంగా గౌడ నెమలి, నెమలికి చెందిన పుంజులు గెలుపొందుతాయని, 14వ తేదీ యాసర కాకిడేగలు, కాకి నెమలిలు, పసిమగల్ల కాకులు, కాకి డేగలకు చెందిన పుంజులు గెలుపొందుతాయి. 15వ తేదీ డేగలు, ఎర్రకాకి డేగలు గెలుపొందుతాయని కోడిపందాల్లో ప్రావీణ్యం వున్నవారు ఈ కుక్కుటి శాస్త్రం ఆధారంగా చెబుతున్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహారుఢ్య పరీక్షల్లో 196 మంది ఎంపిక



అభ్యర్థుల కొలతలు పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతోన్న కానిస్టేబుళ్ళ దేహదారుఢ్య పరీక్షల్లో బుధ వారం 196 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. 315 మంది హాజరవగా, వారిలో 50 మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 265 మందికి శరీరకొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 23 మంది ఛాతి, ఎత్తు తదితర కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరణకు గురయ్యారు మిగిలిన 242 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 28 మంది విఫలమయ్యారు. తదుపరి 214 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 133 మంది అర్హత సాధించగా 81 మంది విఫలమయ్యారు. కాగా 214 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 194 మంది అర్హత సాధించగా 20 మంది విఫలమయ్యారు. మొత్తం 265 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 196మంది అర్హత సాధించగా, 69మంది విఫలమ య్యారు. కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ప్రతి సందర్భంలోనూ స్వయంగా పరిశీలించి, పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు ఎస్పీ పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు సుప్రజ , హనుమంతు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆ.. చేద్దాంతే

- సచివాలయల ఉద్యోగుల్లో పెరుగుతున్న నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆదేశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిని సెట్ సరి చేయకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులు తలెత్తుతాయని కొందరు జిల్లా అధికారులు బహిరంగంగానే అంటున్నారు. కొందరు సచివాలయ ఉద్యోగుల్లో గత ప్రభుత్వంపై ఇప్పటికీ కృతజ్ఞత ధోరణి కనిపిస్తోందని అందువల్లే వారు ఇప్పటి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నారని కొందరు అంటున్నారు. అందువల్లే ప్రభుత్వ ఆదేశాలను సక్రమంగా పాటించకపోవడం.. పనులపై నిర్లక్ష్యం చేస్తున్నారని తెలుస్తోంది.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హవా..

సచివాలయ ఉద్యోగుల పనితీరు, వివరాల సేకరణపై కూడా గుంటూరు జిల్లాలో వివాదం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ మంత్రి దగ్గర ఉండి చాలా మంది జిల్లా అధికారులను సైతం దబాయించి మాట్లాడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సచివాలయ ఉద్యోగుల వ్యవహారాలు చూస్తున్నారు. జిల్లాలోని మొత్తం సచివాలయ సిబ్బంది ఆయన ఆధ్వర్యంలోనే పని చేస్తున్నారు. సదరు ఉద్యోగి సూచనలు మేరకే సర్వేలు, సచివాలయాల్లో పనులు జరుగుతున్నాయని సమాచారం. చివరకు నివేదికలు, ఇతర సమాచారం కోసం జిల్లా అధికారులు కూడా అదే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఆధారపడుతున్నారు.

రూ.4 వేలకు సర్టిఫికెట్

గురజాల టౌన్: అడిగినంత ఇస్తే చాలు ఏ సర్టిఫికెట్ అయినా గంటల్లోనే చేతికి అందుతోంది. ఆ సచివాలయంలో ఓ అధికారి బహిరంగంగానే నగదు వసూలు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాడు. తనకు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలుసని వసూళ్లలో మునిగితేలుతున్నాడు. సాధారణంగా జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు పొందాలంటే దాదాపు నెల రోజులకుపైగానే పడుతుంది. కానీ గురజాల మండలం పులిపాడు-1 సచివాలయంలో ఓ అధికారి గంటల్లోనే ఆ సర్టిఫికెట్ ఇస్తాడు. ఉదయం రూ.4 వేలు ఇచ్చి తల్లిదండ్రుల ఆధార్ కార్డులను వాట్సాప్ చేస్తే సాయంత్రం కల్లా జనన, మరణ ధ్రువీకరణ పత్రం చేతికి అందుతోంది. ఇటీవల గురజాలకి చెందిన ఓ వ్యక్తి సదరు ఉద్యోగికి రూ.4 వేలు ముట్టజెప్పి సర్టిఫికెట్‌ను పొందగా దానిని ఓ ప్రభుత్వ ఉద్యోగికి చూపించగా అది నకిలీదని తేలింది. నకిలీ బాగోతం అధికారులకు తెలిసినా వారు పట్టించుకోకపోవడంతో ఆ సచివాలయ అధికారి చెలరేగిపోతున్నాడు. ఈ అధికారికి మండల పరిధిలోని పలువురు గ్రామ కార్యదర్శులు, మండల అధికారులు సహకరిస్తున్నట్లు సమాచారం. జనన, మరణ సర్టిఫికెట్లే కాక గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కో సదరన్ సర్టిఫికెట్‌కు రూ.20 వేల దాకా తీసుకొని అధిక మొత్తంలో నకిలీ సర్టిఫికెట్లు అందించారనే ఆరోపణలు ఈ అధికారిపై ఉన్నాయి.



గుంటూరు జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న డివైడర్‌పై కూర్చుని ఉన్న పిచ్చి తల్లి

పిచ్చి తల్లి ఎదురుచూపులు !

నవమాసాలు మోసి, కని, పెంచి పెద్ద చేసిన పిల్లల కోసం ఎన్ని అవమానాలు, చీదరింపులు, చీత్కారాలు, మోసాలు ఇలా ఎన్ని ఎదురైనా ఏకబిగువున ఓర్చుకుంటుంది. మరి, తన కడుపున పుట్టిన పిల్లలే తనను మోసం చేస్తే.. ఆ తల్లి తట్టుకోలేదు.. పిచ్చెక్కినట్లు అవుతుంది. ఇందుకు ఉదాహరణనే పై ఫొటోలో కనిపిస్తున్న ఓ పిచ్చి తల్లి. గుంటూరు జనరల్ ఆసుపత్రి ఎదుట ఉన్న డివైడర్‌పై పడుకొని ఆమె కాలం వెళ్లదీస్తూ ఉంటుంది. వాస్తవానికి ఆమెకు పిచ్చి లేదు. కడుపున పుట్టినబిడ్డలే ఆమెను పిచ్చి దానిని చేశారు. తెల్లవారేసరికి, చక్కగా తయారవుతుంది. తన సంచులన్నీ సర్దుకుని వచ్చిపోయే వాహనాలను గమనిస్తూ కూర్చుంటుంది. వస్తారో రారో కూడా తెలియని పిల్లల కోసం గంటల తరబడి ఎదురు చూసే ఆమె, చాలాసార్లు తన తిండి గురించి కూడా పట్టించుకోదని అక్కడి వాళ్లు చెబుతున్నారు. ఎవరైనా ఆమె వద్దకు వెళ్లి వివరాలు అడిగితే చెప్పే సమాధానాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. 'నా పేరు మేరీ' (నిజమో కాదో తెలియదు) అని చెబుతుంది. 'పిల్లలు ఎంత మంది?' అని అడిగితే 'పచ్చి బాలింతను' అని 'ఇక్కడ ఎందుకు ఉన్నావు?' అంటే, 'పిల్లలు వస్తారు.. తీసుకుపోతారు' అని చెబుతుంది. గత కొన్ని నెలలుగా ఆమెను అడిగినవారికి ఇవే వివరాలు చెబుతోంది. ఏ క్షణంలోనైనా తన పిల్లలు వచ్చి తనను తీసుకెళతారనే నమ్మకంతో ఉన్న ఆ పిచ్చితల్లి రాత్రి పూట ఏడుస్తూ పడుకుంటుంది. - (గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ధనుర్మాస వ్రత దీక్షలతో పుణ్యఫలం



మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామికి అత్యంత ఇష్టమైన ధనుర్మాసంలో దీక్షలను ఆచరించడం వలన పుణ్యఫలం సిద్ధిస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి శ్రీశైల నగర్‌లోని బాపూజీ విద్యాలయంలో వైటీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో త్రిదండి చినజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో మంత్రి లోకేశ్ మంగళవారం రాత్రి పాల్గొన్నారు. చినజీయర్ స్వామి మంత్రి లోకేశ్‌కు ఆశీర్వచనాలు అందజేసి కొద్దిసేపు ఆధ్యాత్మిక అంశాలపై చర్చించారు. మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఎగువ, దిగువ సన్నిధులు, విజయకీలాద్రి క్షేత్రాలను ధనుర్మాసంలో దర్శించుకోవడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపైనా వుండాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

ముక్కోటి ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు



మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం




మంగళగిరిలోని ఆలయం వద్ద క్యూ ఏర్పాటు

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలు సన్నద్ధమవు తున్నాయి. ఇప్పటికే ఆయా ఆలయాల పాలక కమిటీలు, అధికారులు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో ఆలయ సిబ్బంది ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా అమరావతి వైకుంఠపురంలోని క్రౌంచగిరిపై స్వయంభువుగా వెలిసిన కలియుగదైవం వెంకటేశ్వరస్వామి ఆలయం, తెనాలి పట్టణంలోని సుప్రసిద్ధ క్షేత్రం వైకుంఠపురంలో వెలిసిన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, మంగళగిరిలోని మంగళాద్రి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంతో పాటు ఆలయాల వద్ద గోపురాల అలంకరణలతో పాటు, స్వామివార్ల దర్శనం, భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు ముమ్మంగా జరుగుతున్నాయి.

- 10న ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం

మంగళగిరి సిటీ, తెనాలి అర్బన్, అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో ముక్కోటి ఉత్సవాలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరుగనున్నాయి. 9న రాత్రి 8 గంటలకు శ్రీ స్వామి వారిని జగన్మోహినిగా అలంకరిస్తారు. 10వ తేది తెల్లవారుజాము ఒంటి గంట నుంచి 3 గంటల వరకు స్వామివారికి తిరువంజనోత్సవం, అనంతరం వేకువజాము 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బంగారు గరుడ వాహనంపై శ్రీవారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి ఏడాది మాదిరిగానే రెండు రోజులపాటు అంటే శుక్ర, శనివారాల్లో శంకుతీర్థం అందించనున్నారు. పదవ తేదీ రాత్రి నమ్మాళ్వార్ అధ్యయనోత్సవాలు (కొలాయి ఉత్సవాలు) ప్రారంభమవుతాయి. ఈ ఏడాది ముక్కోటి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఎగువ, దిగువ సన్నిధుల్లో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఎగువ, దిగువ సన్నిధులను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. వైద్యం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ తదితర సమస్యలు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఇతర అధికారులు మంగళవారం ముక్కోటి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తెనాలిలోని వెంకటేశ్వరస్వామి వారి ఆలయం

తెనాలి పట్టణంలోని సుప్రసిద్ధ క్షేత్రం వైకుంఠపురంలో ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు గావిస్తున్నామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ కంభం సాయిబాబు చెప్పారు. శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇందుకు చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం విలేకర్లకు వివరించారు. ఉత్తర ద్వార దర్శనం విశేషాలతో రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి అమ్మవార్లను ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై అలంకరించి భక్తులకు దర్శనం ఇప్పిస్తారు. దక్షిణావృత శంఖంతో తీర్థం పంపిణీ చేస్తారు. అనంతరం స్వామి అమ్మవార్ల మూలవరులను దర్శించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు గావిస్తున్నామని, క్యూ లైన్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. భక్తులకు తాగునీరు, పిల్లలకు, బాలింతలకు పాలు పంపిణీ, ఉచిత ప్రసాదం అందజేసేందుకు 7 వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈవో అనుపమ, అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేద వ్యాస మహర్షి ఆలయం

అమరావతి వైకుంఠపురంలోని కలియుగ వైకుంఠ క్షేత్రంగా పేరుగాంచిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీ ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. తెల్లవారు జామున 4గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ఋత్వికులు స్వామివారి పాదలకు పాలాభిషేకం చేసి అనంతరం ప్రత్యేక అలంకారం, 5గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించడం జరుగుతుంది. స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయ ఉత్తర ద్వారంలో ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. 10 గంటలకు స్వామివార్ల గ్రామోత్సవం గరుడ వాహనంపై గ్రామ పురవీధులు, ఆలయ మాడ వీధులలో జరుగుతుంది. ఆలయాన్ని సందర్శించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడం జరుగుతుంది. ముక్కోటి పర్వదినం రోజునుండి ఐదు రోజుల పాటు అధ్యయన ఉత్సవాలు జరుగుతాయని ఉదయం సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.



మంగళగిరిలో ముక్కోటి ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థానం, ఎంటీఎంసీ అధికారులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు: ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు

వినుకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడప నున్నట్లు వినుకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బుధవారం మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు డిపో పరిధిలోని పలు సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిపో పరిధిలోని సమస్యలపై ఫోన్‌ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని ఫర్నిచర్ బహిరంగ వేలం

నరసరావుపేట లీగల్, జనవరి 7: ప్రభుత్వ మద్యం దుకాణాలలో ఉపయోగించి వాపసు అయిన ఫర్నిచర్‌ను బహిరంగ వేలం వేయనున్నట్లు నరసరావుపేట ఏపీఎస్‌బీసీ ఐఎంఎల్ డిపో మేనేజర్ జి.నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న డీమార్ట్ ఎదురుగా ఉన్న ఏపీ ఎస్‌బీసీ గోడౌన్లో వేలం జరుగుతుందని ఆయన తెలిపారు. ఫ్రిజ్‌లు 73, ఇన్వర్టర్లు 71. క్యాష్ బాక్సులు 63, బార్కోడ్ స్కానర్లు 397, క్యాష్ కౌంటింగ్ మిషన్లు 95, కంప్యూటర్లు 8, ప్రింటర్లు 83, సాంసంగ్ ట్యాబ్లు 54, ఇనుప ర్యాకులు 62, ప్లాస్టిక్ కుర్చీలు 97, ఫ్యాన్లు 67, సీసీటీవీ కెమెరాలు 77లను బహిరంగ వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల కొనుగోలుదారులు టెండర్లు వేయవలసిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాలకు నరసరావుపేట ఏపీ ఎస్‌డీసీఎల్‌ఐఎంఎల్ డిపో మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి రూ.10వేలు ఆర్థికసాయం

వినుకొండ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమానికి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి తండ్రి కొత్త వెంకటఆంజనేయులు రూ.10వేలు ఆశ్రమ నిర్వాహకులు గుమ్మడి వెంకటేశ్వరరావుకు మంగళవారం అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన కొత్త వెంకట అంజనేయులుకు ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన కాపు విద్యార్థినీ, విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు ఆరిశెట్టి వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహకారంతో పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 11వ తేదీన స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. స్కాలర్‌షిప్‌ల కోసం 2024వ సంవత్సరం 10వ తరగతిలో 500 మార్కులు, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులు, జేఈఈ, నీట్‌లో సీట్లు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులతోపాటు ఏపీ ఎంసెట్‌లో 2024 సంవత్సరంలో 5వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. అర్హతకల్గిన విద్యార్థినీ, విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు మార్కులిస్టు, టీసీ, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతోపాటు పేరు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8919958544, 8008996879లో సంప్రదించాలన్నారు.

వేల్పూరువాసి నేత్రదానం


నేత్రదానం చేసిన కోటయ్య (ఫైల్ ఫొటో)

వేల్పూరు (శావల్యాపురం) జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరుకు చెందిన మోదుగుల కోటయ్య మరణానంతరం నేత్రదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచినట్లు అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు ప్రశంసించారు. గ్రామానికి చెందిన మోదుగుల కోటయ్య (82) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు కోటయ్య నేత్రాలను దానం చేశారు. చలపతిరావు ఇచ్చిన సమాచారంతో పెదకాకాని శంకర్ ఆసుపత్రి ఐ బ్యాంక్ వైద్యులు కోటయ్య కళ్ళలోని కార్నియా పొరలను సేకరించారు. డాక్టర్ మరియ మాట్లాడుతూ నేత్రదానం చేయదలచినవారు మృతదేహాన్ని ఏసీబాక్స్‌లో ఉంచి 8గంటల్లో ఐ బ్యాంక్ సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు. నేత్రదానం చేసిన కోటయ్య కుటుంబసభ్యులు మోతుకూరి వెంకాయమ్మ, శివమ్మ, రాజ్యం, వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులను డాక్టర్ మరియ, వైద్యసిబ్బంది, చలపతిరావు, గ్రామస్థులు అభినందించారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్

చిలకలూరిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని మునిసిపల్ కౌన్సిల్లో తీర్మానం చేయాలని మున్సిపల్ చైర్మన్ రఫానీని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక వినతిపత్రాన్ని రఫానీకి అందచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం రాధాకృష్ణ, గోవిందు శంకర శ్రీనివాసన్, ఎం.ప్రసన్న, కాటూరి కోటేశ్వరరావు, షేక్ నస్రుద్దీన్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

ఈపూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండేపల్లి, అంగలూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఏఈవో బండి అప్పారావు మాట్లాడుతూ పంట పొలాలలో నల్లి ఉధృతిని కనుగొనేందుకు పసుపు, బులుగు, తెలుపు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని సూచించారు.

అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ

కలెక్టర్ అరుణ్‌బాబు


సభలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో స్థానిక స్టేషన్ రోడ్డులోని లూథరన్ అంధుల పాఠశాలలో జరిగిన జయంత్యుత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంధుల లిపిని 12 చుక్కల నుంచి 6 చుక్కలకు కుదించి అంధుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ 1809లో జన్మించిన బ్రెయిలీ చిన్నతనంలో కంటికి కత్తి మొన తగిలి చూపును కోల్పోయాడని తెలిపారు. కంటి చూపుపోయినా నిరాశ చెందకుండా తోబుట్టువులతో కలిసి పాఠశాలకు వెళ్లి చదువుకున్నాడన్నారు. అంధుల లిపిని 12 చుక్కల నుంచి 6 చుక్కలకు కుదించి, స్పర్శకోడ్ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా నేడు ప్రపంచవ్యాప్తంగా అంధులు ఉన్నత స్థితిలో ఉండటానికి కారకుడు అయ్యాడన్నారు. తొలుత పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద ఉన్న బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రెయిలీ క్యాలెండర్ ఆవిష్కరించి విద్యార్థులకు క్రికెట్ కిట్‌లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, పాఠశాల సిబ్బంది ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కోడిపందేల నిషేధం వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

కోడిపందాలు నిషేధం: కలెక్టర్

నరసరావుపేట రూరల్, జనవరి 7: (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలో కోడిపందాలు నిషేధమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో కోడి పందేలు నిర్వహించటం - పాల్గొనటం చట్టరీత్యా నేరం అనే గోడపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా పల్నాడు జిల్లాలో కోడి పందేలు నిర్వహించటం జీవ జంతు సంరక్షణ చట్టం సెక్షన్ 34/1960, సెక్షన్ 10/1974 ప్రకారం కోడి పందేలు నిర్వహించుట చట్టరీత్యా నేరం అన్నారు. అందులో పాల్గొన్నవారు గాని, ప్రోత్సహిస్తున్న వారికి కూడా వర్తిస్తుందన్నారు. కోడి పందేలు నిర్వహించినచో 144 సీఆర్‌పీసీ ప్రకారం శిక్షారు లన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీలు ఆవిష్కరణ

నరసరావుపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీలను కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీ అరుణ్‌బాబు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌టీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బి.వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యాశాఖలో అమలువుతున్న 117 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. పలు డిమాండ్లపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు కోనూరు సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, రాష్ట్ర కౌన్సిలర్ రాజా చౌదరి, సెల్ల రాజ్, ఊటుకూరి శ్రీకృష్ణ, జిల్లా కౌన్సిలర్లు మురకొండ శ్రీనివాసరావు, కల్లూరి శ్రీనివాసరావు, ఎంటీఎస్ శ్రీనివాసరావు, ముప్పాళ్ళ జ్ఞానేశ్వరి, ఎన్‌టీఏ సీపీఎస్ స్టేట్ కన్వీనర్ గద్దె రామకోటేశ్వరరావు, పీ ఆదాంఖాన్, ఏ నాగమల్లేశ్వరిదేవి, బీ విజయలక్ష్మి, జీ లిల్లీకిరణ్మయి, బోడెపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య మిత్రలు, టీమ్ లీడర్లకు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి

● ఎన్టీఆర్ వైద్య సేవ సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్

నరసరావుపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వైద్య మిత్రాలు, టీమ్ లీడర్‌లు తప్పనిసరిగా రోజుకు మూడుసార్లు ముఖ ఆధారిత హాజరు వేయాలని ఎన్టీఆర్ వైద్య సేవ సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నెలవారీ వైద్య మిత్ర డే మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రైవేట్ నెట్‌వర్క్‌కు వచ్చే రోగులకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద నమోదు చేసి ఉచితంగా ఓపీ, దానికి సంబంధించి పరీక్షలు ఉచితంగా చేయించాలన్నారు. ఒకవేళ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఆ రోగం వర్తిస్తే వారికి ఆపరేషన్ మందులు పరీక్షలు, భోజనం, వెళ్ళేటప్పుడు ప్రయాణ చార్జీలు దగ్గరుండి వైద్యమిత్ర చూసుకోవాలన్నారు. రోగుల దగ్గర ఎటువంటి డబ్బులు తీసుకోకూడదని, తీసుకుంటే వైద్యమిత్రపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఉచిత పథకంను రోగులకు ఉచితంగా ఆపరేషన్ అన్ని పరీక్షలు ఉచితంగా జరిగేలా వైద్యమిత్రలు బాధ్యత తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీమ్ లీడర్స్ ఆఫీస్ అసోసియేట్, వైద్య మిత్రాలు మాచర్ల బుజ్జి, సాయిబాబు, సుధాకర్, సుబ్బలక్ష్మి, హుస్సేన్, అప్పారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ లేకున్నా పిల్లలను బడిలో చేర్చుకోవాలి

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు బత్తుల పద్మావతి
● పుట్టిన తేదీ సమస్యను పరిష్కరించి ఆధార్ వచ్చేలా చూడాలి


బొప్పూడిలో పిల్లల తల్లులతో మాట్లాడుతున్న పద్మావతి

చిలకలూరిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి మంగళవారం చిలకలూరిపేట ప్రాంతంలో పర్యటించారు. బొప్పూడిలో ఎస్టీలు నివసించే ప్రాంతాన్ని, పాత రాజపేటలోని ఏపీ మోడల్ స్కూలును సందర్శించారు. బొప్పూడిలో 20 మంది పిల్లలు బడి బయట ఉన్నట్టు ఆమె గమనించారు. వీరు బడికి ఎందుకు వెళ్ళటం లేదని ఆరా తీశారు. ఆధార్ కార్డులు లేనందువలన వీరిని బడిలో చేర్చుకోవడం లేదని తెలుసుకున్నారు. వెంటనే ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి వారిని వెంటనే బడిలో చేర్చుకోవాలని ఆదేశించారు. పుట్టిన తేదీని స్కూల్లో క్రియేట్ చేసి వారికి ఆధార్ కార్డులు వచ్చేలా చూడాలని కూడా ఆదేశించారు. పిల్లల తల్లులతో సమావేశమై పిల్లలందరినీ స్కూలుకు పంపాలని కోరారు. అనంతరం పాత రాజాపేటలోని ఏపీ మోడల్ స్కూల్లో తనిఖీలు జరిపారు. విద్యార్థులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అన్నం ముద్దగా ఉంటున్నదని, తినలేక పోతున్నామని చెప్పారు. దీనితో ఆమె అక్కడికక్కడే చిలకలూరిపేట తహసీల్దార్‌కు ఫోన్‌చేసి బియ్యాన్ని మార్పించి మంచి బియ్యం పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమాలలో ఐసీడీఎస్ సీడీపీవో శాంతకుమారి, సూపర్‌వైజర్లు ఆర్.సామ్రాజ్యం, ఎస్.భూలక్ష్మి, ఎంఈవో లక్ష్మి పాల్గొన్నారు.

యడ్లపాడు పాఠశాలలో తనిఖీ

యడ్లపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రమైన యడ్లపాడు జడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె బాలల హక్కులు, కిశోర వికాసం, స్పాన్సర్‌షిప్ పథకాల గురించి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలకు రూ.4వేలు చొప్పున అందిస్తున్నాయని, అటువంటి వారిని గుర్తించి వారితో దరఖాస్తు చేయించాలన్నారు. అలాగే విద్యార్థులకు అందుబాటులో ఫిర్యాదుల పెట్టె ఉంచాలని, ఏవైనా ఫిర్యాదులు వస్తే పాఠశాల స్థాయిలోనే పరిష్కరించుకోవాలన్నారు. విద్యార్థులందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. తల్లులతో మాట్లాడి ప్రీస్కూల్ గురించి తల్లులకు అవగాహన కల్పించి 3 నుంచి 5 ఏళ్ళలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో శాంతకుమారి, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విజయభారతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలి

● ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల రికార్డులను వీవోఏలు పెండింగ్‌లో పెట్టకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా సంఘాల రికార్డుల నిర్వహణపై మండలంలోని అన్ని గ్రామాల వీవోఏలకు మంగళవారం శిక్షణనిచ్చారు. లీగల్ కోఆర్డినేటర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ గ్రామాల్లోని వీవోఏలు డ్వాక్రా మహిళలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, డ్వాక్రా సంఘాల రికార్డుల్లో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. రుణాలు చెల్లించిన మహిళలకు తప్పకుండా రసీదులు ఇవ్వాలని, మహిళలు తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించబడిన పుస్తకాలను వీవోఏలకు అందజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, ఉపాధ్యక్షురాలు వేగుళ్ళ కుమారి, ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, సీసీలు ఖాజావలి, మేరీ, కరుణమ్మ, అకౌంటెంట్ వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



బియ్యాన్ని అందజేసిన రోటరీ క్లబ్ నిర్వాహకులు

అనాథ పిల్లలకు 'గుప్పెడు బియ్యం' అందజేత

చిలకలూరిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గుప్పెడు బియ్యం అనే పథకంలో భాగంగా స్థానిక సాదినేని చౌదరయ్య స్కూల్ రోటరీ ఇంటరాక్ట్ విద్యార్థులు రెండు నెలలుగా క్వింటాన్నర బియ్యం సేకరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల అనుమతితో ఇంటి వద్ద నుంచి ప్రతిరోజు గుప్పెడు బియ్యం తీసుకువచ్చి స్కూలులో ఏర్పాటుచేసిన డబ్బాలో పోసేవారు. బియ్యంతో పాటు కొందరు నిత్యావసరాలు కూడా సమకూర్చారు. ఈ బియ్యాన్ని, నిత్యావసర సరుకులను స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం వారి ఆధ్వర్యంలో మంగళవారం మార్టూరులోని శ్రీ శారదా నికేతన్ స్కూలు అనాథ విద్యార్థులకు అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వారణాసి శరత్‌కుమార్, కార్యదర్శి కొల్లా సుబ్బారావు, స్కూలు డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ భాషా, క్లబ్ సీనియర్ సభ్యులు చెంచు పున్నయ్య, లింగయ్య చౌదరి, భాస్కర రెడ్డి, వసంతరావు, అలంగర్ మోహన్ పాల్గొన్నారు.

మూడు ఇసుక టిప్పర్లకు జరిమానా

నరసరావుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓవర్ లోడ్‌లో వెళుతున్న ఇసుక లారీలకు రూరల్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. సత్తెనపల్లి రోడ్డు నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా ఓవర్ లోడ్, అతివేగంగా వెళుతున్న మూడు లారీలను పోలీసులు గుర్తించారు. అమరావతి నుంచి పట్టణం గుండా వినుకొండ వెళుతున్నాయి. ఓవర్ లోడ్ కింద ఒక్కొక్క లారీకి రూ.1035 జరిమానా విధించి లారీలను వదిలేసినట్టు రూరల్ ఎస్‌ఐ కిషోర్ తెలిపారు.

నవోదయ మోడల్ టెస్టుకు విశేష స్పందన

వినుకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి మధుర ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని విజేత కాన్సెప్ట్ పాఠశాల్లో మంగళవారం నవోదయ మోడల్ గ్రాంట్ టెస్టు నిర్వహించారు. ఈ పరీక్షలకు విశేష స్పందన లభించడంతో పాటు అత్యధిక మార్కులు సాధించి 5వ తరగతి విభాగంలో చల్లా వెంకటనరేంద్ర రెడ్డి, శ్యామల మధులత, బి.ఉదయకుమార్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. అదేవిధంగా 8వ తరగతి విభాగంలో జీ.హేమంత్‌సాయి, ఎస్.భానుగణేష్, ఏశైలేష్‌లు విజేతలుగా నిలిచి రూ.2000, రూ.1500, రూ.1000 బహుమతులను అందుకున్నారు. వీటితోపాటు 14మందికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కావూరి సాయికుమార్, ఆవులమంద బ్రహ్మయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నూజెండ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల, గురుకుల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థినులకు గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, త్రిపురాపురం డీసీ గంగినేని రాఘవ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించే విధంగా పోత్సహించేందుకు యూటీఎఫ్ సహకారంతో స్టడీ మెటీరియల్‌ను తయారు చేయించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు రొడ్డా వీరాంజనేయరెడ్డి, తేజ ఎడ్యుకేషనల్ అకాడమీ వ్యవస్థాపకులు ఏ దుర్గారావు, పాఠశాల ప్రిన్సిపల్ ఎన్‌వీ రమణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పాపురంలో పొలం పిలుస్తోంది

నాదెండ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి మొక్కజొన్న పంటలో ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. నరసరావుపేట ఏడీఏ పీ మస్తానమ్మ కంది పంటలో పూత, పిందె రాలకుండా మల్టీకే ఒక కిలో, ఫార్ములా-4 అరకిలో చొప్పున పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ లింగయ్య, ఏవో హరిబాబు, ఎంపీటీసీ ఎస్.హరిబాబు, విస్తరణ అధికారి జీవన నాయక్, నాగరత్నం పాల్గొన్నారు.


ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు సమస్యను తెలియజేస్తున్న శేషమ్మ

పించను పునరుద్ధరించరూ...

● మృతిచెందినట్లు వైసీపీ ప్రభుత్వం పెన్షన్ తొలగించారు
● అంతేకాకుండా బీమా చెల్లించినట్లు రికార్డులో నమోదు
● జీవీ ఆంజనేయులుకు ఓ మహిళ విజ్ఞప్తి

వినుకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వినుకొండలో ఓ దారుణమైన పరిస్థితి ఆలస్యంగా వెలుగుచూసింది. ఆయురారోగ్యాలతో బతికి ఉన్న మహిళను మృతిచెందినట్లుగా రికార్డుల్లో చూపించి బీమా చెల్లించినట్లు అనంతరం పెన్షన్ నిలిపివేసిన సంఘటన ముక్కున వేలు వేసుకునేలా ఉంది. తాను జీవించే ఉన్నా నెలలుగా పెన్షన్ రాక ఇబ్బందులు పడుతున్నట్లు ఆ బాధిత మహిళ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును ఆశ్రయించి వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దారుణమైన ఘటనపై కన్నీంటి పర్యంతమైంది. వివరాలలోకి వెళ్ళితే వినుకొండ పట్టణంలోని సీతయ్యనగర్‌కు చెందిన వల్లెపు శేషమ్మ 15 సంవత్సరాలుగా వితంతు పింఛను ప్రభుత్వం నుంచి పొందుతోంది. పింఛను డబ్బే ఆధారంగా జీవనం సాగిస్తున్నది. 2023 అక్టోబరు నుంచి అధికారులు ఆమె మృతిచెందినట్లు పింఛను నిలిపివేయడంతో కష్టాలు మొదలయ్యాయి. అంతేకాకుండా ప్రమాద బీమా పేరిట నామిని ఖాతాల్లో డబ్బులు కూడా జమచేశారు. తర్వాత నెల నుంచి ఆమె పింఛను ఆగిపోయింది. అప్పటి నుంచి ఆ మహిళకు కుటుంబం గడవడం కష్టంగా ఉండడంతో ఆదుకోవాలని చేతులు జోడించి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును మంగళవారం వేడుకుంది. జరిగిన అన్యాయంపై జీవీ వెంటనే స్పందించి శేషమ్మకు పింఛను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆమె జీవికి కృతజ్ఞతలు తెలిపి, తనలా మరొకరికి అన్యాయం జరగకుండ చూడాలని వేడుకొంది.

డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలలో అరుదైన చికిత్స

నరసరావుపేట లీగల్, జనవరి 7: తీవ్రమైన రక్తపోటు, (గుండె నిమిషానికి 240 సార్లు కొట్టుకోవడం వల్ల) గుండె నొప్పి, కిడ్నీ సమస్యకు అంజిరెడ్డి వైద్యశాలలో ఓ మహిళకు చికిత్స చేసినట్లు వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మంగళగిరి మండలం వడ్లమూడి వారిపల్లి గ్రామానికి చెందిన సాయికృష్ణరాజ్ పది రోజుల క్రితం తమ వైద్యశాలలో చేరినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ వైద్యశాలకు చెందిన కార్డియాలజిస్ట్ శబరి గిరీష్ సూచనల మేరకు రక్త పరీక్షలు చేసి రిపోర్టుల అనంతరం రోగికి కిడ్నీ కిరువైపులా బ్లాకులు ఉన్నట్లు గుర్తించామన్నారు. రోగి అంగీకారంతో కిడ్నీలకు ఇరువైపులా బైరినల్ ఆర్థరీ స్టంటింగ్ అనే అత్యాధునిక పద్ధతిలో స్టంట్లు అమర్చి రక్త సరఫరాను సాధారణ స్థితికి తీసుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. దీంతో గుండె కొట్టుకునే వేగం సాధారణ స్థితికి వచ్చిందన్నారు. ఇలాంటి క్లిష్టతరమైన, శస్త్రచికిత్స పల్నాడు జిల్లాలో ఇదే మొట్టమొదటిది అన్నారు. తమ వైద్యశాల సేవలను పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లా ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పేషెంట్ వైద్యశాల సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్తిపాటికి ప్రధాని మోదీ సభ బాధ్యతల అప్పగింత

చిలకలూరిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో బుధవారం జరిగే ప్రధాని మోదీ రోడ్ షో, బహిరంగ సభకు సంబంధించి స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావుకు కొన్ని బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. జీవీఎంసీ పరిధిలోని కొన్ని వార్డులతో పాటు పెందుర్తి నియోజకవర్గ బాధ్యతలు ఆయనకు అప్పగించారు. సభాస్థలిలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పుల్లారావు మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గం నుంచి కనీసం 40వేల మంది తరలివెళ్లేలా స్థానిక నాయకత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. రాష్ట్రానికి సంబంధించి పలు ముఖ్యమైన నిర్ణయాలు ప్రధాని ప్రకటిస్తారని రాష్ట్ర ప్రజానీకం ఎదురుచూస్తున్నదని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.


లబ్ధిదారుల వద్దకు వెళ్ళి వివరాలు సేకరిస్తున్న అధికారులు

ప్రారంభమైన లబ్ధిదారుల గుర్తింపు సర్వే

వినుకొండ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జరిగిన పింఛన్ల పంపిణీ అక్రమాల్లో ఎన్డీఏ ప్రభుత్వంలో ఎట్టకేలకు నిజమైన అర్హులైన పెన్షన్‌దారులను గుర్తించేందుకు నడుం బిగించింది. మండలంలోని గోకనకొండ, నాగులవరం, పిట్టంబండ, ఉమ్మడివరం, పెదకంచర్ల, విఠంరాజుపల్లి, అందుగులపాడు, నడిగడ్డ, దొండపాడు, పానకాలపాలెం గ్రామాల్లో పింఛనుదారులు సమర్పించిన సదరం సర్టిఫికెట్లపై వైద్య సిబ్బంది మంగళవారం విచారణ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్స్ డి.రోశయ్య, అరుణ్‌కుమార్, ఎస్.అమిత్‌మోహన్‌దాసు, రాజశేఖర్, మెడికల్ ఆఫీసర్ ఎస్.రామాంజనేయులు నాయక్, ఎంసీఎం ప్రభాకరరావు, ఏపీఎం నాగేశ్వరరావు, సీసీలు, వీవోఏ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో ఏఎంరెడ్డి డిప్లొమో విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి విడుదల చేసిన పరీక్షా ఫలితాలలో ఏఎంరెడ్డి డిప్లొమో విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. సీఎస్‌ఈకి చెందిన ఎస్.లక్ష్మి 93.50శాతం, టీ సత్యసాయి 90.10శాతం మార్కులు సాధించారన్నారు. సివిల్‌లో సీహెచ్ అక్షయ్‌కుమార్ 82.30 శాతం, మెకానికల్‌లో కే సిద్దార్థ 82శాతం మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతిశ్రీనివాస రెడ్డి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, డీన్ డాక్టర్ ఎ కిషోర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఎన్ఈసీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట రూరల్, జనవరి 7: (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, త్రీడీ ఆర్ట్ పోటీలు, సంప్రదాయ వస్త్రధారణ, పోటీలను నిర్వహించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు భోగి మంటలను వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు.